





- నష్టాలతో తగ్గిన మిరప..
- శనగ వెలవెల.. మెరిసిన మొక్కజొన్న
- మిర్చికి ప్రత్యామ్నాయంగా పొగాకు సాగు

సాగు.. తారుమారు

అతివృష్టి.. అనావృష్టి.. తెగుళ్లు.. దిగుబడులు తగ్గడం.. ధరలు లేకపోవడం.. నష్టాలు.. కష్టాలతో.. సాగు చిత్రం ఏటికేడు మారిపోతోంది. పంటల సాగు తారుమారవుతోంది. నష్టాలు.. ధరలను బట్టి రైతులు సాగు చేసే పంటలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వస్తున్నారు. ఏటేటా పంటల సాగు మారుస్తున్నా ఏమాత్రం కలసి రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో వాణిజ్య పంటలు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలోని డెల్టాలో వరి ఎక్కువగా సాగవుతుంటోంది. అయితే ఈ సారి వర్షాలు చాలావరకు పంటలను దెబ్బతీశాయి. దీంతో రైతులు సాగు చేసే పంటలను ఏటికేడు మారుస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గత ఏడాది కన్నా ఈ ఏడు మిరప సాగు 55,804 ఎకరాల్లో తగ్గింది. మిరపకు ప్రత్యామ్నాయంగా పొగాకు.. మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గు చూపారు. గత ఏడాది ఆశాజనకంగా లేక పోవడంతో ఈ ఏడాది శనగ సాగును వేలాది మంది రైతులు వీడారు. మొత్తంగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో పంటల సాగులో విస్తృత మార్పులు చోటుచేసుకున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ఏటికేడు సాగు చిత్రం మారిపోతున్నది. తెగుళ్లు.. గిట్టుబాటు ధర లేకపోవడం తదితర పరిణామాల నేపథ్యంలో రైతులు ఈ ఏడు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టి పంటలు పండించినా మిగులు లేక అప్పుల ఊబిలో కూరుకుపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గ చూపుతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలో పత్తి, మిర్చి సాగు చేస్తున్న రైతులు విసిగి వేసారిపోతున్నారు. తక్కువ పెట్టుబడులు.. ఎక్కువ దిగుబడులతో.. కొంతైనా లాభాలతో బయటపడే అవకాశం ఉన్న పంటల సాగుకు ఎక్కువ మంది రైతులు ఆశక్తి చూపుతున్నారు. మొక్కజొన్న, పొగాకు సాగు గణనీయంగా పెరగ్గా మిరప, శనగ సాగు అదే స్థాయిలో పతనమైంది. గత ఏడాదికి కన్నా మిరప, శనగ సాగు 1,15,503 ఎకరాల్లో తగ్గింది. మొక్కజొన్న, పొగాకు సాగు గత ఏడాది కన్నా 99,550 ఎకరాల్లో పెరగడం గమనార్హం.



పంటల సాగు ఇలా(ఎకరాల్లో)..

పంటలు	గత ఏడాది	ఈ ఏడాది
మిరప	1,71,226	1,15,422
పొగాకు	44,035	91,585
శనగ	1,38,052	78,352
మొక్కజొన్న	52,000	1,09,247



ధర పతనంతో తీవ్రంగా నష్టం

గత ఏడాది గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రైతులు విస్తృతంగా మిరప సాగు చేశారు. వర్షాభావం.. తెగుళ్ల మిరప దిగుబడులపై (మిగతా 8వ పేజీలో)

మంగళగిరి చేనేతకు జీవం



చేనేత పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత (ఫైల్)

- 10.80 ఎకరాల్లో మెగా చేనేత పార్కు



చేనేతకు మంత్రి నారా లోకేశ్ పునరుజ్జీవం

- నేతన్నల రెండున్నర దశాబ్దాల కల సాకారం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు వేల మందికి ఉపాధి
- కంచి సిల్క్ పార్కు తరహాలో ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశాలు


మంగళగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చేనేత ఖిల్లా మంగళగిరిలో చేనేతకు జీవం పోసేందుకు మంత్రి నారా లోకేశ్ తీసుకున్న సంకల్పం నెరవేరింది. ఒకప్పుడు చేనేత మగ్గాల సవ్వడులతో.. తెల్లవారుతూనే పరిచినట్టు కనిపించే మొలకట్టుడు అల్లికలతో.. సంప్రదాయ కళతో కనువిందు చేసే వీధులతో దర్శనమిచ్చిన నాటి చేనేతకేంద్రం మంగళగిరికి తిరిగి ఆ శోభ సంతరించుకోకున్నది. వివిధ కారణాలతో ఐదారు వేల మగ్గాలు ప్రస్తుతం 14 వందలకు తగ్గిపోయాయి. మంగళగిరిలో ప్రాభవం కోల్పోయిన నాటి చేనేత కళకు పునరుజ్జీవం పోయాలని దాదాపు రెండున్నర దశాబ్దాలుగా నేతన్నలతోపాటు చేనేత కార్మికసంఘాలు, వామపక్ష పార్టీలు పాలకప్రభుత్వాలను వేడుకుంటూనే ఉన్నాయి. అడపాదడపా పోరాటాలు కూడా చేస్తూ వచ్చాయి. కానీ స్పందన మాత్రం శూన్యం. ఏళ్లుగా మెగా చేనేత పార్కు మంగళగిరివాసులను ఊరిస్తూ వస్తోన్నది. అయితే నారా లోకేశ్ తన రాజకీయ జీవితానికి చేనేత కేంద్రమైన మంగళగిరేనే ఎంచుకోవడంతో మంగళగిరి దశ తిరిగింది. ఈ క్రమంలో మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్కు ఆవిర్భవించబోతుంది. నగరంలోని ఆటోనగర్‌కు వెనుకవైపు శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన సర్వే నెంబరు 16లోని 10.80 ఎకరాలను 31 ఏళ్ల లీజుకు తీసుకుని చేనేత పార్కును నెలకొల్పేందుకు చేనేత జౌళి శాఖ సిద్ధమైంది. ఎకరాకు రూ.25 వేల వంతున..ప్రతీ మూడేళ్లకు పది శాతం వంతున లీజు పెంచేలా దేవదాయశాఖతో చేనేత జౌళిశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. చేనేతపార్కు కోసం నిర్దేశించిన ఈ స్థలాన్ని ఆ శాఖ మంత్రి ఎస్ సవిత సంబంధితశాఖ ఉన్నతాధికారులతో కలిసి బుధవారం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పార్కును తమిళనాడులోని (మిగతా 8వ పేజీలో)

ఆటోనగర్‌లో ఇప్పటికే వీవర్స్‌శాల

లోకేశ్ ఆటోనగర్ ప్రాంతంలో తన సొంత ఖర్చులతో లోకేశ్ ప్రత్యేకంగా వీవర్స్‌శాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆధునిక డిజైన్లపై నేతన్నలకు శిక్షణను ఇప్పిస్తున్నారు. తయారైన వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు. దీంతో తృప్తి చెందని లోకేశ్ మంగళగిరికి ఒకనాటి ఖ్యాతిని మళ్లీ తెచ్చేందుకు ప్రత్యేకంగా చేనేత పార్కు నిర్మాణానికి పూనుకున్నారు.



రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ భవనం (ఊహాచిత్రం)



వేర్‌హౌస్ (ఊహాచిత్రం)

తండ్రిని కాలువలో పడేసిన కొడుకు
❖ బొమ్మరాజు పల్లి సమీపంలో మృతదేహం లభ్యం

6

పులిచింతల ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల

మాచర్లలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

ఏఎన్‌యూ డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పునరావాసం.. పాట్లు

- గుండ్లకమ్మ ముంపు గ్రామస్థుల అవస్థలు
- సమస్యలపై బాధితుల గోడు.. స్పందించిన మంత్రులు
- త్వరలో పర్యటిస్తామని గొట్టిపాటి, రామానాయుడు హామీ
- ఇప్పటికే సమస్యలపై అధ్యయనం చేసిన అధికారులు



ధేనువకొండ గ్రామం

అద్దంకి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉండే అవకాశం లేదు.. పునరావాస కాలనీల్లో ఉండలేరు.. వసతులు కల్పించడంలో పాలకుల నిర్లక్ష్యం.. మొత్తమ్మీద గుండ్లకమ్మ ముంపు గ్రామీణులు సరైన ఆవాసం.. వసతులు లేక అల్లాడుతున్నారు. సమస్యలపై గత ఐదేళ్ల వైసీపీ పాలకులు పట్టించుకోక పోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యలపై దృష్టి సారించాలన్న ముంపుగ్రామాల ప్రజల గోడుపై కూటమి ప్రభుత్వంలో స్పందన వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడం, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ముంపు గ్రామాల సమస్యలపై అవగాహన ఉండడంతో తమ కష్టాలు తీరతాయని గుండ్లకమ్మ బాధితులు ఆశిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రులు త్వరలో పర్యటిస్తామని హామీ కూడా ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే గుండ్లకమ్మ రిజర్వాయర్ పర్యవేక్షణ అధికారులు ఇటీవల తిమ్మారెడ్డిపాలెంలో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేశారు.

ముంపు గ్రామాల్లో ఉండలేక

పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన జరగకపోవడంతో గుండ్లకమ్మ ముంపు గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. రిజర్వాయర్ నిర్మాణంతో మద్దిపాడు, అద్దంకి, కొరిశపాడు మండలాల్లోని 13 గ్రామాలు పూర్తిగా, పాక్షికంగా ముంపునకు గురయ్యాయి. రెండు దశాబ్దాల కిందట గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రారంభం కాగా, పుష్కర కాలం కిందట ఆయా గ్రామాల ప్రజలకు పరిహారం చెల్లించారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వతో మద్దిపాడు మండల పరిధిలోని గ్రామాలు పూర్తిగా మునిగి పోయాయి. దీంతో ప్రజలు సుమారు పుష్కరకాలం కిందట గ్రామాలను ఖాళీ చేసి పునరావాస కాలనీలకు తరలిపోయారు. అయితే పాక్షిక ముంపు గ్రామాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగుతుంది. పునరావాసకాలనీల్లో వసతుల కల్పన అటకెక్కింది. తిమ్మారెడ్డి పాలేనికి చెందిన పునరావాసకాలనీలో కనీస మౌలిక వసతుల కల్పన జరగలేదు. రోడ్లు, మంచి నీటి వసతి, వీధిలైట్లు, పాఠశాలను ఏర్పాటు చేయలేదు. కాలనీలో ఇళ్ల నిర్మాణం చేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఇక గ్రామంలో ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరి నివాసానికి కూడా పనికిరాకుండా పోయాయి. దీంతో పలు కుటుంబాలు ఇతర గ్రామాలకు, అద్దంకి తదితర పట్టణాలకు వెళ్లి నివాసం ఉంటున్నాయి. దేనువకొండ పునరావాస కాలనీ గ్రామానికి సుమారు 30 కి.మీ దూరంలో ఉన్న అద్దంకి, వేలమూరిపాడు, మేదరమెట్ల వద్ద ఉంది. ఆ కాలనీలో నివాసం ఉంటూ పనులకు వెళ్దామంటే పనులు దొరకని పరిస్థితి.

పకడ్బందీగా.. ఎలక్షన్ కోడ్

- మండలి ఎన్నికలకు ముందస్తు చర్యలు

3,46,614 మంది ఓటర్లు.. 416 పోలింగ్ స్టేషన్లు

ఎన్నికలపై సమీక్షలో రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాస న మండలికి సంబంధించి ఎలక్షన్ కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినందున ఎన్నికలు ముగిసే వరకు ఎలక్షన్ కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి వెబ్ ఎక్స్ ద్వారా బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు ఎస్పీలు, డీఆర్‌వోలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తెనాలి సబ్‌కలెక్టర్‌తో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై నాగలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ ఈ నెల 29 నుంచే అమల్లోకి వచ్చిందన్నారు. 3న నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. శాసనమండలికి జరిగే ఎన్నికలు సజావుగా చేపట్టేందుకు సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచ తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో రాజకీయ నాయకుల బ్యానర్లు, పోస్టర్లు, చిత్రపటాలు తొలగించి నివేదిక ఇవ్వాలని తెలిపారు. రాజకీయ పార్టీ నేతల విగ్రహాలకు ముసుగేయాలన్నారు. గ్రాడ్యుయేట్ ఓటరు దరఖాస్తులను ఫిబ్రవరి 10 లోపు పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. నిబంధనల మేరకు వసతులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్‌స్టేషన్ల వివరాలు శుక్రవారం సాయంత్రంలోపు అందించాలని తెలిపారు. ఎన్నికలు పేపర్ బ్యాలెట్ ద్వారా జరుగుతున్నందున బ్యాలెట్ బాక్సుల లభ్యత వివరాలు తెలపాలన్నారు. బ్యాలెట్ బాక్సులకు మరమ్మతులు చేపట్టి సిద్ధం చేయాలన్నారు.



అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజకీయ పార్టీలు సహకరించాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణ - గుంటూరు జిల్లాలకు సంబంధించి ఈ నెల 29కి 2,06,225 మంది పురుషులు, 1,40,344 మంది మహిళలు, 45 మంది ట్రాన్స్‌జెండర్స్ కలిపి మొత్తం 3,46,614 మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. 416 పోలింగ్ స్టేషన్లు గుర్తించామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. పబ్లిక్ స్థలాల్లో సమావేశాలు, ర్యాలీలకి ఆర్‌వో వద్ద అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశాల్లో రిటర్నింగ్ అధికారులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, జేసీ భార్గవతేజ, డీఆర్‌వో షేక్ ఖాజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీసీవో వీరాచారి, డీపీవో నాగసాయి, మైన్స్ డీడీ శ్రీవెంకటసాయి, ఉద్యాన డీడీ రవీంద్ర, డ్వామా పీడీ శంకర్, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ లక్ష్మి, పశు సంవర్థక శాఖ జేడీ నరసింహారావు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్యతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు చిరతనగండ్ల వాసు, చరక కుమారగౌడ్, వై కృష్ణకాంత్, కంచర్ల శివరామయ్య, గాదె వెంకటేశ్వరరావు, అత్తోట జోసఫ్, బిల్లా సునీల్, సేవాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదనంగా ధాన్యం సేకరణ

- 50,000 ఎంటీలకు డీఆర్సీలో తీర్మానం
- సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు తాజాగా ప్రతిపాదనలు
- ఇప్పటికే జిల్లాలో 57 వేల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో రికార్డుస్థాయిలో 57,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతుధరకు కొనుగోలు కేంద్రాల నుంచి ప్రభుత్వం సేకరించింది. 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమవుతుండడం తోడు బహిరంగా మార్కెట్‌లో ధర మరీ తీసికట్టుగా ఉండడంతో అన్నదాతలు ప్రభుత్వం కొనుగోళ్లపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం ఇప్పటికే పూర్తికాగా ఇంకా పెద్ద సంఖ్యలో ధాన్యం కోతకు సిద్ధంగా ఉంది. డెల్టాలో ఇంకా 50,000 టన్నుల ధాన్యం పొలాల మీదే ఉండగా, ఎన్ఎస్‌పీ ఆయకట్టు కింద సాగైన వరి త్వరలోనే చేతికొచ్చే అవకాశం ఉంది. పర్చూరు పరిధిలోని రైతులకు న్యాయం జరగాలంటే మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల విషయంలో అదనంగా అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఈ అంశమే ప్రధాన అజెండాగా కలెక్టరేట్‌లో మంగళవారం డీఆర్సీ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ధాన్యం అదనంగా సేకరించడానికి ప్రభుత్వం అనుమతుల విషయంలో అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ఏకాభిప్రాయం వెలిబుచ్చారు. దీంతో ఇంకో 50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు ఇవ్వాలని డీఆర్సీ తీర్మానం చేసింది.

తొలుత 50,000.. తర్వాత 7,000

ప్రభుత్వం ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు జిల్లాలో తొలి విడతలో 50,000 టన్నులకు అనుమతులిచ్చింది. అవసరాన్ని బట్టి దఫాదఫాలుగా మరో 7,000వరకు అనుమతులిచ్చింది. 57వేల మెట్రిక్‌టన్నుల సేకరణ కూడా పూర్తికాగా.. ఇంకా పెద్దసంఖ్యలో ధాన్యం రైతుల వద్ద ఉంది. ఈ పరిస్థితుల్లో మరో 50,000 టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులివ్వాలని సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు అధికారులు బుధవారమే ప్రతిపాదనలు పంపారు. అదనంగా ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం పంపిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా ప్రజాప్రతినిధులు గట్టి ప్రయత్నమే చేస్తున్నారు. అన్నదాతల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సివిల్ సప్లయిస్ రాష్ట్ర విభాగానికి కూడా క్షేత్రస్థాయిలో రైతులవెతలను ఏకరువుపెట్టి అనుమతులు ఇచ్చేలా కోరనున్నారు.

హేతుబద్ధీకరణపై కమిటీ వేయండి

● సీఎంకు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు రజాక్ విజ్ఞప్తి



సీఎం చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న షేక్ అబ్దుల్ రజాక్

గుంటూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హేతుబద్ధీకరణ అంశంపై సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ నియమించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న సచివాలయ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి హేతుబద్ధీకరణపై సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యం చేసినందున రావాల్సిన బకాయిలు, ప్రొబేషన్ డిక్లరేషన్ అయిన నాటి నుంచి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్, పే-రి విజన్ కమిషన్ ఏర్పాటు చేయాలని, మెరుగైన ఐఆర్ ప్రకటించాలని, ఓల్డ్ పెన్షన్స్ స్కీమ్ అమలు చేయాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రమేష్ కుమార్, నాగ సాయి, బాజీ పఠాన్, వెంకటేశ్వర్ రెడ్డి, రమేష్, సుగుణ, రవీంద్ర రాజు, కేదేశ్వరరావు, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గత నవంబరులో నిర్వహించిన డిగ్రీ కోర్సుల 3వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9329 మంది హాజరవ్వగా 5198 మంది ఉత్తీర్ణులు అయ్యారని ఆయన తెలిపారు. పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు మాట్లాడుతూ ఫలితాలపై విద్యార్థులకు సందేహాలు ఉంటే రీవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో జవాబు పత్రానికి రూ. 1490 ఫిబ్రవరి 13వ తేదీలోగా చెల్లించి కళాశాల ద్వారా డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి పంపాలని సూచించారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.వి. కృష్ణారావు, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్, ఆచార్య కె. ధనలక్ష్మి, పరీక్షల నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు, సీటీఏ, ఏసీటీఏ పరీక్షల అధికారులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి

పెదకాకాని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు విశ్వవిద్యాలయం ఘన నివాళులు అర్పించింది. గురువారం మహాత్మ గాంధీ విగ్రహం వద్ద వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.సోమశేఖర్ వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ మహాత్మ గాంధీకి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ గాంధీ చూపిన అడుగుజాడల్లో నడిచి సమాజాన్ని ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ సూచించిన సత్యం, అహింస మార్గాలను ఎంచుకున్న వారు జీవితంలో వెనుకడుగు వేయరని, ఆ విధంగా నేటి యువత లక్ష్యాలను నెరవేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ఎం.సురేష్ కుమార్, ఆచార్య పి.సిద్దయ్య, ఆచార్య ఏ. ప్రమీలారాణి, కోఆర్డినేటర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాతలుగా పూలే దంపతులు

● మహిళా విద్య, ఉపాధితోనే దేశాభివృద్ధి సాధ్యం
● జాతీయ సదస్సులో వీసీ ఆచార్య కె.గంగాధరరావు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల కృషి అనిర్వచనీయమని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయంలోని పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే కాంట్రిబ్యూషన్ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ గంగాధరరావు మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు విద్యావంతులు అయినట్లయితే దేశాభివృద్ధితోపాటు ప్రపంచ వృద్ధి కూడా సాధ్యమవుతుందన్నారు. 19వ శతాబ్దంలో పూలే దంపతులు సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. కనీస అవసరాలు లేని ఆ రోజుల్లోనే విద్యకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన వీరు అవిరళ కృషిని చేశారని కొనియాడారు. పూలే సంస్కరణలు, సావిత్రిబాయి పూలే ఆచరణలు నేటి సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య టి. రమేష్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాల్లో మహిళలు రాణిస్తున్నారంటే దానికి సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే ఆనాడు తీసుకొచ్చిన సంస్కరణలు కీలకంగా ఉన్నాయన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ మహిళ సాధికారత సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని గుర్తు చేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వంటి మహనీయులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి అన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు మాట్లాడుతూ రెండు రోజుల ఈ జాతీయ సదస్సుకు అనూహ్య రీతిలో పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాల నుంచి పరిశోధకులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ సోషియాలజీ ప్రొఫెసర్ ఆచార్య డి.రామారావు, సదస్సు కోశాధికారి ఆచార్య కె.ధనలక్ష్మి, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య అశోక్ కుమార్, ఆచార్య తులసీదాస్, విభాగం ప్రోగ్రామర్ బి.కోటి యాదవ్, అధ్యాపకులు, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో సరికొత్త రికార్డులు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో కూటమి ప్రభుత్వం సరికొత్త రికార్డులు నెలకొల్పుతుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాట శ్రీధర్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ప్రాంతానికి కొత్త పరిశ్రమ వచ్చేలా, ప్రతి ప్రాంతం ఒక్కో రంగంలో గుర్తింపు పొందేలా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ లక్షల కోట్లు పెట్టుబడులు ఆకర్షిస్తున్న ఫలితాలు త్వరలోనే అంతా చూస్తారని అన్నారు. చంద్రబాబు నాయుడు దీర్ఘకాలిక లక్ష్యాలలో ప్రస్తుతం చూస్తున్న ఫలితాలు ప్రారంభం మాత్రమేనని, కేవలం ప్రభుత్వం వచ్చిన ఏడు నెలలో రూ.6,33,568 కోట్లు పెట్టుబడులతో 4 లక్షల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చే సాహసం ఎక్కడైనా జరిగిందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, అమరావతి, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా చేసుకొని, అందుకోసం రాష్ట్రానికి 20 భారీ పరిశ్రమలను సాధించుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కే చెల్లుతుందన్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ళలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాకపోవటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చినా జగన్‌రెడ్డి అండ్ గ్యాంగ్‌కు ఎప్పుడూ ఏడుపే అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, జిల్లా టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జాస్తి చంద్రశేఖర్, దండా అనీల్ పాల్గొన్నారు.

తండ్రిని కాలువలో పడేసిన కొడుకు

● బొమ్మరాజుపల్లి సమీపంలో మృతదేహం లభ్యం



కొండయ్య మృతదేహం

ఈపూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కొడుకే కాలయముడై కాలువ నీటిలో పడేసి హత్య చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన నూజండ్ల గ్రామానికి చెందిన గంగినేని కొండయ్య(85)ను పెద్ద కొడుకు వెంకటేశ్వర్లు కారులో తీసుకువచ్చి భద్రుపాలెం వద్ద నాగార్జున సాగరు కుడిప్రధాన కాలువ నీటిలో పడేశాడు. అక్కడకు కొద్ది దూరంలో ఉన్న గ్రామస్తులు చూసి వెంకటేశ్వర్లును పట్టుకొని దేహశుద్ధి చేయగా, ఇంట్లో గొడవలు కారణంగా నా తండ్రి, నేను కాలువలో దూకి చనిపోయేందుకు వచ్చామని వెంకటేశ్వర్లు వారికి చెప్పాడు. గ్రామస్తులు వెంకటేశ్వర్లును పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. కాలువ నీటిలో వృద్ధుడు కొద్దిసేపు ఈతకొట్టి నీటిలో మునిగినట్లు చెప్పారు. వృద్ధుడిని రక్షించేందుకు గ్రామస్తులు ప్రయత్నించగా డీప్‌కట్ కావడంతో లోతు ఎక్కువగా ఉండి మునిగిపోయాడు. గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టగా బొమ్మరాజుపల్లి సమీపంలో మృతదేహం కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొండయ్య, శిరోమణి దంపతులకు ఇద్దరు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు. కొండయ్య, భార్య శిరోమణి పంపకాలలో తమకు వచ్చిన ఆస్తిని విక్రయించగా వచ్చిన సుమారు రూ.20 లక్షలు తీసుకు వెళ్లి మూడు సంవత్సరాల కితం పెద్ద కొడుకు వెంకటేశ్వర్లుకు ఇచ్చి అతని వద్దే ఉంటున్నారు. ఏడాదిన్నర క్రితం తల్లి శిరోమణి చనిపోయింది. కొండయ్య వృద్ధాప్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. వృద్ధుడైన తండ్రి వలన తరచూ ఇంట్లో గొడవలు వస్తున్నాయి. ఈక్రమంలో గురువారం వెంకటేశ్వర్లు ఇంట్లో భార్య అనూరాధతో గొడవపడ్డాడు. ఆ సమయంలో భార్య స్పృహతప్పి పడిపోయింది. వెంకటేశ్వర్లు ఆవేశంతో వేరే వాళ్ల కారు అద్దెకు తీసుకొని వచ్చి అందులో తండ్రి కొండయ్యను తీసుకుని వెళ్లి కాలువలో పడేశాడు. గురువారం రాత్రి సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వినుకొండ రూరల్ సీఐ ఆర్ ప్రభాకర్ గ్రామస్తులను సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లు తమ అదుపులో లేడని ఎస్‌ఐ ఎం.ఉమామహేశ్వరరావు చెప్పారు.

దాడి చేసిన భర్త బంధువులపై కేసు

కొల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భర్త అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు వచ్చిన భార్య, అత్తమామలపై మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు విచక్షణా రహితంగా దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల గ్రామం క్రాపకు చెందిన పట్టాభి అరుణ్ కుమార్ (28) చేబ్రోలు మండలానికి చెందిన కఠారి వైశాలి అనే మైనర్‌ను గతేడాది అక్టోబరు 10న వివాహం చేసుకున్నాడు. ఎటువంటి పనులు చేయకుండా ఖాళీగా తిరుగుతూ మద్యం తాగి భార్యను వేధిస్తున్నాడు. గతేడాది నవంబరు 10న మృతుడు అరుణ్ కుమార్ సోదరి భర్త పులివర్తి రవి మృతుని భార్యను పుట్టింటికి పంపించి వచ్చాడు. ఈ క్రమంలో పుట్టింట్లో భార్య వద్దకు తరచూ వచ్చి వెళుతున్న అల్లుడిని అత్తమామలు తమ కుమార్తెను కాపురానికి తీసుకు వెళ్లాలని కోరారు. ఈ నెల 23న తమ బంధువు చిలకా కిరణ్, ఇతర పెద్ద మనుషుల సమక్షంలో తెనాలిలో భార్యను కాపురానికి తీసుకు వెళ్లే విషయమై మృతునితో చర్చించి మందలించారు. దీంతో పెద్ద మనుషులను తీసుకువచ్చి తన భార్యను కాపురానికి తీసుకు వెళ్తానని చెప్పాడు. అదే రోజు అర్ధరాత్రి తెనాలిలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన మృతుని స్నేహితుడు, మృతుడు భార్య పురుగు మందు తాగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి వైద్యశాలకు తరలించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అరుణ్‌కుమార్ పరిస్థితి విషమించడంతో గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 28న మృతి చెందాడు. మృతుని ఖననం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన భార్య, ఆమె తల్లి ధనలక్ష్మిపై మృతుని బంధువులు ఇంట్లోకి తీసుకువెళ్లి దాడి చేశారు. పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మృతుడి బావ పుల్లారావు, తల్లి రాజకుమారి, మృతుడు సోదరి శారద, ఆమె భర్త రవిలు మృతుని భార్య వైశాలిని గర్భవతి అని చూడకుండా కడుపుపై తన్నారు. ఇదే సమయంలో బయట ఉన్న ఆమె తండ్రి భూషణంపై కూడా పది మంది ముకుమ్మడి దాడికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు అడ్డుపడి సర్ది చెప్పి ఆటోలో పంపించగా వేమూరు మండలం జంపని వద్దకు చేరుకుని అక్కడ నుంచి 108 అంబులెన్స్‌లో తెనాలి వైద్యశాలకు వెళ్లారు. భర్తను కోల్పోయి భర్త కుటుంబ సభ్యుల దాడికి గురైన బాధితురాలు చికిత్స పొందుతూ వైద్యశాలలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్‌ఐ అర్జున్ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు

● ఫోన్ నంబరు ఆధారంగా గుర్తించిన పోలీసులు

దాచేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిన విద్యార్థులను 24 గంటలలోపే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన గురువారం దాచేపల్లిలో చోటు చేసుకుంది. దాచేపల్లి ఎస్‌ఐ సౌందర్ రాజన్, ఎస్‌ఐ పాపారావు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన ఇర్ల శ్రీనివాసరావు, మీసాల డేవిడ్‌రాజు, చర్లపల్లి నగేష్ కృష్ణ 8వ తరగతి చదువుతున్నారు. వీరు బుధవారం మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా నడికుడి రైల్వే స్టేషన్ నుంచి రైలు ఎక్కి తెలంగాణ రాష్ట్రంలోని జడ్చర్లకు చేరుకున్నారు. వారి ముగ్గురిలో ఒకరి వద్ద సెల్ ఫోన్ ఉంది. సెల్ ఫోన్ నంబరు ఆధారంగా వారి అడ్రస్‌ను కనుగొన్నారు. తెలంగాణ పోలీసుల సహకారంతో వారిని పోలీసుల అదుపులో ఉంచారు. కుటుంబ సభ్యులు, పోలీసులు కలిసి ప్రైవేట్ వాహనంలో జడ్చర్లకు చేరుకొని పిల్లలను తీసుకొని దాచేపల్లి పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటి వరకు తీవ్ర ఆందోళనతో ఉన్న తల్లిదండ్రులు పిల్లలను చూసి పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. పోలీసులు స్పందించిన తీరు, చేసిన సేవలు స్థానిక ప్రజలు ప్రశంసలు అందజేశారు.



విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న దాచేపల్లి పోలీసులు

కృత్రిమ మేధతో ఔషధాల విశ్లేషణ



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మొంటు కుమార్ ఎం పటేల్

గుంటూరు (విద్య) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేధా) ద్వారా ఔషధాల డేటాను విశ్లేషించవచ్చునని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ మోంటు కుమార్ ఎం పటేల్ అన్నారు. గురువారం చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ (చిప్స్)లో జరిగిన ఫార్మా నెక్స్ జాతీయ స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర అధ్యక్షత వహించారు. డాక్టర్ మోంటు కుమార్ ఎం పటేల్ మాట్లాడుతూ ఔషధాల పరస్పర చర్యలను కృత్రిమ మేధ ద్వారా విశ్లేషించడానికి అవకాశం ఉందన్నారు. ఫార్మసీ రంగంలో కృత్రిమ మేధా కీలక భూమిక పోషించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఔషధాలు తయారీ, పరిశోధన వంటి రంగాల్లో దీని పాత్ర వేగవంతం కానున్నట్లు తెలిపారు. ఫార్మసీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ ప్రసంగిస్తూ ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు డాక్టర్ నిరంజన్ బాబు, డాక్టర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఎం.రాధాకృష్ణమూర్తి, ఏపీ ఫార్మసీ కౌన్సిలర్ రిజిస్టర్ డాక్టర్ విలియం క్యారీ, చిప్స్ కళాశాల కార్యదర్శి డాక్టర్ సీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ సిలబస్ డిజిటలైజేషన్

గుంటూరు (విద్య) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రోజు రోజుకు పెరుగుతున్న పరిశ్రమ అవసరాలు, టెక్నాలజీలకు అనుగుణంగా ఫార్మసీ సిలబస్‌ను డిజిటలైజ్ చేయనున్నట్లు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ప్రెసిడెంట్ డాక్టర్ మోంటుకుమార్ ఎం.పటేల్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో "ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్ ఏ ఫ్యూచరిస్టిక్ అప్రోచ్" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మోంటు కుమార్ ఎం.పటేల్ మాట్లాడుతూ పీసీఐ ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు సరికొత్త టెక్నాలజీలపైన ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు స్కిల్స్ పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి నెలా 150 మంది విద్యార్థులకు ట్రైనింగ్ అందించడానికి వీలుగా ట్రైనింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన న్యూఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎం.వెంకట రమణ, కౌన్సిల్ మెంబర్, న్యూఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్ రెడ్డి, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విల్లియం కారే, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస బాబు పాల్గొన్నారు.

జువాలజీ విభాగంలో ముగిసిన జాతీయ సదస్సు

పెదకాకాని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జువాలజీ అండ్ ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ టాక్సికాలజీ, ఇమ్యూనాలజీ అండ్ బయోడైవర్సిటీ అనే జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి, పోస్టర్ ప్రజెంటేషన్ చేసిన వారికి ధ్రువ పత్రాలను అందజేశారు. సదస్సు ముగింపు సందర్భంగా డైరెక్టర్ ఆచార్య వి.వెంకటరత్నమ్మ మాట్లాడుతూ ఈ సదస్సులో వాతావరణ కాలుష్యం, కలుషిత వ్యర్థాల పరిణామాలు, వాటి నివారణ చర్యలు చర్చించినట్లు తెలిపారు. అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు తమ విలువైన సలహాలను అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ మాజీ రెక్టార్ ఆచార్య ఎం.భాస్కర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, సదస్సు కో డైరెక్టర్ ఆచార్య పి.పద్మావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య ఎం.జగదీష్ నాయక్, ఆచార్య కె.సుమంత్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ గోపాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల



చేప పిల్లలను విడుదల చేస్తున్న జిల్లా మత్స్య శాఖ అధికారి సంజీవరావు

అచ్చంపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద గురువారం జిల్లా మత్స్య శాఖ అధికారులు ఎనిమిది లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్య శాఖ అధికారి సంజీవరావు మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాల్లో జీవనోపాధి మెరుగు పడుతుందన్నారు. చేప పిల్లల విడుదలతో ఆ నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యువజన పథకం ద్వారా 52 లక్షల చేప పిల్లలకు గానూ మొదటి విడతగా పులిచింతల జలాశయంలో ఎనిమిది లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, డీఈఈ టి.అరుణ కుమారి, కిషోర్, లలిత, శోభ, నాగార్జున సాగర్ మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వీవీఏ శ్రీనివాసరావు, మత్స్య శాఖ సహాయ పర్యవేక్షకులు కె.భాగ్యలత, అచ్చంపేట తహసీల్దార్ జి.శ్రీనివాసరావు, ఎంపీడీవో కె. శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వర్లు, మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ గదిలో విద్యార్థి ఆత్మహత్య



రాజశేఖర్ (ఫైల్)

మాచర్లటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ గదిలో విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మాచర్ల పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. వెల్దుర్తి మండలం లోయపల్లికి చెందిన పందిరి రాజశేఖర్ (15) పట్టణంలోని రాయవరంలోని ఓ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. స్కూల్‌లోని హాస్టల్‌లోనే ఉంటూ విద్యను కొనసాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒంటరిగా హాస్టల్ గదికి వచ్చి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌కు వచ్చిన విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసే సరికి అప్పటికే రాజశేఖర్ మృతి చెంది ఉన్నాడు. స్కూల్ యాజమాన్యం రాజశేఖర్ మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మాచర్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వేటపాలెం ఎడ్ల జతకు ప్రథమ బహుమతి

రెంటచింతల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని కానుకమాత 175వ తిరునాళ్లను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన 6 పళ్ల ఒంగోలు జాతి పశుప్రదర్శన రక్తి కట్టించింది. అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరికి(వేటపాలెం,బాపట్ల జిల్లా) చెందిన ఎడ్ల జత 4500 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి, మోదుగు రామిరెడ్డి(పెదపరిమి), రామినేని రత్తయ్య చౌదరి (చేబ్రోలు) కంబైన్డ్ జత 4049.6 ద్వితీయ బహుమతి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి, ఏటుకూరి శ్రీనివాసరావు (పల్నాడు) 3600 అడుగుల దూరం లాగి మూడో బహుమతి, అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు (పెనమలూరు, కృష్ణా జిల్లా)3487.3 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతి, మేకా అంజిరెడ్డి(చల్లగుండ్ల, నకరికల్లు) 3347.1 దూరం లాగి ఐదో బహుమతిని గెలుచుకున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం నాటికి 552.70 అడుగులు ఉంది. ఇది 215.76 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7436 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 24,685 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,168 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

1,09,020 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,02,729 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,09,020 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,402 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7000	13600	334	7500	13000
నెంబరు. 5	8000	14000	నెంబరు.5	--	--
273	10000	10000	273	9200	9200
341	8000	15000	341	8500	11000
4884	10500	10500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7000	15000	తేజ	9000	13500
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	8000	11500
దేవనూరు డీలక్స్	8500	13500	దేవనూరు డీలక్స్	12000	12000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	8500

4న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 4న మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

నేడు మెగా జాబ్‌మేళా

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించే ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగించుకోవాలన్నారు. 10వ తరగతి నుండి పీజీ వరకు చదివినవారంతా జాబ్ మేళాకు హాజరు కావచ్చునన్నారు. ఆధార్‌కార్డు, పాస్‌ఫోటో, విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. సూర్యలంకరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఉదయం 9గంటలకు కార్యక్రమం ప్రారంభమౌతుందని తెలిపారు.

స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకోండి

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాలు, కాపు కులం వారికి స్వయం ఉపాధి పథకం కింద ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జి.రఘునాథరెడ్డి తెలిపారు. జనరిక్ మెడికల్ షాపులు, వ్యవసాయం, రవాణా, పరిశ్రమ, వ్యాపార సర్వీస్‌లకు బ్యాంకుల ద్వారా వివిధ యూనిట్లకు సహాయ సహకారాలు కల్పించటానికి ఫిబ్రవరి 7లోగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు తీసుకుంటామన్నారు. పట్టణపరిధిలోని బీసీ, కాపు, ఈబీసీల వారు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఐటీఐ కళాశాలలో బ్రిడ్జి కోర్సు

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సులు పాస్ అయిన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో అడ్మిషన్ పొందుటకు నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బ్రిడ్జి కోర్సును నిర్వహిస్తున్నామని ప్రధానాచార్యులు ఎన్.సుధాకర్‌బాబు తెలిపారు. ఈ బ్రిడ్జి కోర్సును ఫిబ్రవరి 21వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సు ఉత్తీర్ణులైనవారు నేరుగా మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సులో రెండో సంవత్సరంలో ప్రవేశించేందుకు ఆసక్తి ఉన్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ నిజాంపట్నం కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9963509246ద్వారా తెలుసుకోవచ్చునన్నారు.

పిటీషన్ కొట్టివేత చెంపపెట్టు: కొల్లా

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో చంద్రబాబుపై సీఐడీ దాఖలు చేసిన కేసులను ఇప్పుడు సీబీఐకి బదిలీ చేయాలని సుప్రీంకోర్టుకు వెళ్లటం వెనుక వైసీపీ కక్ష సాధింపు, రాజకీయ కుట్రలు దాగి ఉన్నాయని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. న్యాయస్థానం పిటీషన్ కొట్టివేయటం చెంపపెట్టు అన్నారు.

రూ.20 వేలు విరాళం అందజేత

రేపల్లె, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం మండలం, పల్లపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని హరిజనవాడ వారికి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరతో టీడీపీ మండల అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్‌యాదవ్ సంఘ పెద్దలకు రూ.20వేలు విరాళాన్ని అందించారు.

నేడు బాపట్లకు సీపీఎం రాష్ట్ర జాతా

● జిల్లా కార్యదర్శి గంగయ్య

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధి నినాదంతో సీపీఎం చేపట్టిన రాష్ట్రజాత శుక్రవారం బాపట్ల చేరుకుంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సి.హెచ్.గంగయ్య తెలిపారు. బాపట్ల పాతబస్టాండ్ సెంటర్లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు తరలి రావాలన్నారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు.

మట్టి తరలిస్తున్న 4 ట్రాక్టర్లు సీజ్

పిట్టలవానిపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెం మండలం చందోలు శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న 4 ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు చందోలు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. గురువారం రెవెన్యూ, పోలీసు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో వీఆర్వో అరుణ ప్రసన్న, ఎస్ఐ శ్రీనివాస్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రత్యేక తరగతులపై డీవైఈవో సంతృప్తి

అమృతలూరు, జనవరి, 30(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పది విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై డిప్యూటీ డిఈవో సంతృప్తి వ్యక్తపరిచారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ప్రతి విద్యార్థి 45 రోజుల పాటు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే ఉత్తీర్ణులు కావడంతో పాటు నూరుశాతం ఫలితాలు సాధించడానికి అవకాశం ఉందన్నారు. హెచ్ఎం నిరీక్షణరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు విస్తృత స్థాయి సమావేశం

వేమూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వేమూరు నియోజకవర్గ కూటమి పార్టీల విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 3 గంటలకు తెనాలి కోర్టు సమీపంలోని ఎన్‌వీఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు క్యాంపు కార్యాలయ వర్గం తెలిపింది. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లను ఏ విధంగా సమాయత్తం చేయాలి. బూత్, పోల్ మేనేజ్‌మెంట్‌పైన అవగాహన కల్పిస్తారన్నారు.

పేరులో భవిత.. తీరులో అభద్రత

● కనీస వసతుల్లేక ఇబ్బంది పడుతున్న దివ్యాంగ చిన్నారులు

● పట్టించుకోని అధికారులు



వేమూరులోని భవిత కేంద్రం



తలుపులు లేని బాత్రూమ్‌లు



మంచినీటి పంపు చుట్టూ ఉన్న అపరిశుభ్రత

వేమూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో దివ్యాంగుల సేవల కోసం నిర్మించిన భవిత కేంద్ర భవనానికి భద్రత లేకపోగా వనరుల లేమితో దివ్యాంగ పిల్లలకు ఇబ్బందిని కలిగిస్తుంది. 2016లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణ స్థలంలో భవిత కేంద్ర భవనాన్ని నిర్మించారు. సంబంధిత కాంట్రాక్టర్ భవనానికి కిటికీలు, బాత్రూమ్‌లు, ద్వారాలకు తలుపులు బిగించలేదు. నాణ్యత లోపంతో నిర్మాణ పనులు చేపట్టడంతో ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతింది. ప్రారంభానికి కనీసం రంగులు కూడా వేయలేదు. అదే పరిస్థితుల్లో ఆనాడు కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. దీనిపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించిన నాథుడే లేడు. కేంద్ర పరిధిలో 2011లో 250 మంది, 2023లో 350 మంది దివ్యాంగ పిల్లలు ఉండేవారు. 2024 విద్యా సంవత్సరానికి ఆ సంఖ్య 158కి తగ్గింది. కనీసం మంచినీటి పంపు దగ్గర కూడా శుభ్రమైన వాతావరణం లేదు. దివ్యాంగ పిల్లలను కేంద్రానికి తీసుకువచ్చే తల్లిదండ్రులు సరైన సౌకర్యాలు లేని కారణంగా తమ పిల్లలను కేంద్రానికి తీసుకు రావడం లేదు. వారంలో రోజుకు ఒక ప్రోగ్రాం జరుగుతుంది. ఆదివారం సెలవు మినహాయిస్తే మిగతా రోజుల్లో ప్రతి సోమవారం ఫిజియోథెరపీ, రెండు రోజుల పాటు గ్రామాల్లో దివ్యాంగ పిల్లల పరిస్థితిని పరిశీలిస్తారు. పాఠశాలలకు వెళ్లే వారి విషయాలపై ఆరా తీస్తారు. మిగతా రోజుల్లో పలు కార్యక్రమాలను కేంద్రంలో నిర్వహిస్తారు. ప్రభుత్వం అనేక రకాలుగా దివ్యాంగుల కోసం సేవలు ఏర్పాటు చేసినప్పటికీ అవి అర్హులైన వారికి సక్రమంగా అందడంలేదు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక పర్యవేక్షణతో కేంద్ర భవనంలో తగిన వనరులు కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

దీనిపై కేంద్రంలో పని చేసే సిబ్బందిని వివరణ కోరగా తాము చేసేది ఏమీ లేదని, అతి తక్కువ జీతాలతో పని చేస్తున్నామని చెబుతున్నారు. తమ విధి నిర్వహణలో మాత్రం బాధ్యతగానే ఉంటున్నామని, భవనం భద్రత, వసతుల విషయాలను ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. కేంద్రానికి ప్రస్తుతం 9, 10 మంది దివ్యాంగ పిల్లలు మాత్రమే వస్తున్నారని తెలిపారు.

మహాత్ముడి సేవలు చిరస్మరణీయం



బాపట్లలో గాంధీ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి తదితరులు

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన పటానికి సిబ్బందితో కలిసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, మేనేజర్ లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తహసీల్దార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాల్మన్‌రాజు, భవానీ, గౌరి, సాయి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ ప్రధాన పాత్ర

● గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ సుబ్బారెడ్డి

పిట్టలవానిపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్యం కోసం పోరాడిన ప్రముఖుల్లో మహాత్మాగాంధీ ప్రధాన పాత్ర వహించారని గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ మున్నం చిన్న సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రవాణా శాఖ విశ్రాంతాధికారి మన్నెం గుడేర, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి నాగరాజు తదితరులు పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

కర్లపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మహాత్మా గాంధీ వర్ధంతి ని వాసవి క్లబ్, వాసవి క్వీన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ బొలిశెట్టి రాంబాబు, క్లబ్ అధ్యక్షుడు కూసం లక్ష్మయ్య, క్వీన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆలపాటి అనూష పాల్గొన్నారు.

● **చెరుకుపల్లి (ఆంధ్రజ్యోతి):** గుళ్ళపల్లిలోని వైసీపీ కార్యాలయంలో రేపల్లె వైసీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దుండి జగ్గారెడ్డి, కాశీ ప్రభాకర్, జి.రాజశేఖర్, వంగర భాను, రవిరెడ్డి, అంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నగరం (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు వెంకట కృష్ణారావు, వైస్‌ప్రెసిడెంట్ స్వామి, లక్ష్మణ్‌రావు, తాండవకృష్ణ, బాలగోపాల్, బొలిశెట్టి శ్రీకాంత్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **భట్టిప్రోలు (కొల్లూరు) :** భట్టిప్రోలులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం, రథం సెంటర్లోని గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూనుగుంట్ల శ్రీధర్, బి.శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు బి.వెంకటచంద్రశేఖరరావు, కుబేర వనితక్లబ్ అధ్యక్షురాలు మద్దుల లక్ష్మీప్రియ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో కమిషనర్ విస్తృత తనిఖీలు



పైపులైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంతను పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. తెల్లవారుజామున పటేల్ నగర్‌లో పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. వార్డుల్లో పారిశుధ్య విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై కార్మికులకు కొన్ని సూచనలు చేశారు. జీబీసీ రోడ్డులోని కుమ్మరిపాలెం వద్ద తాగునీటి పైపులైన్ లీకులను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సూర్యలంక రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటిన్ పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించాలని క్యాంటీన్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ జి.ప్రసాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

● జిందాల్ పవర్ ప్లాంట్‌కు వ్యర్థాల తరలింపు

బాపట్ల పురపాలక సంఘం పరిధిలో ప్రతిరోజూ సేకరించే 40 టన్నుల తడి, పొడి చెత్తను గురువారం నుంచి గుంటూరులోని జిందాల్ పవర్‌ప్లాంట్‌కు తరలిస్తున్నట్లు కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. అద్దె ప్రాతిపదికన రెండు టిప్పర్ లారీలు తీసుకొని చెత్తను వాటి ద్వారా తరలించారు. జమ్ములపాలెం రోడ్డులోని మున్సిపల్ డంపింగ్‌యార్డు నందు చెత్త నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తరలిస్తున్నట్లు వివరించారు.

● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లోకి వచ్చినందున అన్ని రాజకీయ పార్టీల వారు ప్రధాన, అంతర్గతరోడ్లపై ఉన్న ఫ్లెక్సీలను, జెండాలను తక్షణమే తొలిగించాలని కమిషనర్ తెలిపారు.

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

కొల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పోతార్లంకలో షిరిడి సాయిబాబా మందిర 10వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 5 గంటలకు కాగడ హారతి, అభిషేకాలు, సాయినామస్మరణ, భజన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం జరిపారు. సాయంత్రం సంధ్యా హారతి, గ్రామోత్సవం అనంతరం సేజ హారతి చేశారు. కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి సాయిభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకులు ఈడ్పుగంటి బుజ్జి పర్యవేక్షించారు.

వసంతరావు మృతి పార్టీకి తీరనిలోటు

● రెవెన్యూ శాఖ మంత్రి అనగాని



వీరవసంతరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న మాన్యం వీరవసంతరావు మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నా రు. గురువారం పెదపల్లి గొల్లపాలెంలో ఇటీవల మరణించి న వీరవసంతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని, అధైర్యపడాల్సిన పనిలేదని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతల సుబ్బారావు, విచారపు వీరయ్య, లుక్కా గుదారంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రందనలకు అక్షరూపమే అస్థిత్వవాద కవిత్వం

● ప్రముఖ సాహితీవేత్త పసునూరి రవీందర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పసునూరి రవీందర్

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అణిచివేతకు గురికాబడిన తాడిత, పీడిత వర్గాల గొంతక నుంచి పుట్టిందే అస్థిత్వవాద కవిత్వమని ప్రముఖ సాహితీవేత్త, కవి, రచయిత డాక్టర్ పసునూరి రవీందర్ పేర్కొన్నారు. వివేకా సర్వీస్ సొసైటీ, ధృతి సాహిత్య, సాంస్కృతిక సామాజిక సంస్థ ఆధ్వర్యంలో నెలనెల నందివర్ధనం 97వ కార్యక్రమం అస్థిత్వవాద కవిత్వం అనే అంశంపై నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో వేల సంవత్సరాల ప్రవాహంలో అనేక కథా వస్తువులు మారుతూ వచ్చిన క్రమంలో తరతరాలుగా ఒత్తిడి, వివక్ష అనుభవిస్తున్నవారి ఆక్రందనల శబ్దమే అస్థిత్వవాదమన్నారు. స్పష్టంగా చెప్పాలంటే ఇది కవిత్వం కాదు తాడిత పీడితవర్గాల ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలు మాత్రమేనని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీ కృష్ణ, ధృతి కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం, రసరంజని శాస్త్రి, బాపట్ల, పొన్నూరు, విజయవాడ, చీరాల, గుంటూరు ప్రాంతాలు నుంచి సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలి



రామకృష్ణ ఇంగ్లిషు మీడియం హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన చేస్తున్న రఘురామ్‌గురూజీ

రేపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలనీ, నిబద్ధతతో ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని రఘురామ్‌గురూజీ అన్నారు. గురువారం పట్టణంలోని రామకృష్ణ ఇంగ్లిషు మీడియం హైస్కూల్లో వ్యక్తిత్వ వికాస నిపుణులు రఘురామ్‌గురూజీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంపై బాధ్యతతో, విలువలతో మెలగాలన్నారు. తల్లిదండ్రులపై మర్యాద పూర్వకంగా ఎలా వ్యవహరించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు కొంతమేర బాధ్యత తీసుకుని ఎప్పటికప్పుడు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని, తద్వారా వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చని అన్నారు. రఘురామ్ గురూజీని కరస్పాండెంట్ కె.అపర్ణ, డైరెక్టర్ కె.మహేష్‌లు శాలువాతో సత్కరించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పథకం ద్వారా పంట కాల్వల పూడికతీత



పంట కాల్వ మరమ్మతులు చేస్తున్న ఉపాధి కూలీలు

వేమూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పొలాలకు వెళ్లే సాగునీటి కాల్వలు విచ్ఛిన్నం కావడంతో పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఉపాధి హామీ పథకం ద్వారా మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా మండలంలోని పెనుమర్రులో ఉపాధి హామీ పథకం ద్వారా సాగునీటి కాల్వల మరమ్మతుల పనులను చేపట్టారు. గ్రామ మాజీ సర్పంచ్ మన్నె పసి, ఉపసర్పంచ్ రాజు ఆధ్వర్యంలో గురువారం ఉపాధి కూలీలచే పనులు ప్రారంభించారు. కాల్వల మరమ్మతుల పనులు చేయడం ద్వారా సాగునీరు చివరి భూముల వరకు చేరే విధంగా కాల్వల్లో పూడిక గడ్డితీత పనులు చేయించడం జరుగుతుందని తెలిపారు.

ఆర్మీ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్మీ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న డెల్టా సోల్జర్స్ సభ్యులు

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన ఆర్మీ ఉద్యోగి కు టుంబానికి డెల్టా సోల్జర్స్ తమవంతు ఆర్థిక సాయం అందించారు. మండలపరిధిలోని ఐలవరం గ్రామానికి చెందిన గాలి శ్రీనివాసరావు ఆర్మీలో ఉద్యోగం చేస్తూ మృతి చెందాడు. డెల్టా సోల్జర్స్ మృతుని కుటుంబానికి తమ వంతు సాయం అందించాలనే సదుద్దేశంతో విరాళాలు సేకరించి రూ.లక్ష నగదును ఉద్యోగి సతీమణి, కుమార్తెకు అందజేశారు. ఈ నగదును కుమార్తె పేరు మీద పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. డెల్టా సోల్జర్ సభ్యులకు ఉద్యోగి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

కుష్ఠునివారణ పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి తదితరులు

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్పర్శ కుష్ఠు నివారణ పక్షోత్సవాలు సందర్భంగా కలెక్టర్ జె.వెంకటమురళి గురువారం పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు. కుష్ఠువ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఇన్‌చార్జి డాక్టర్ మహమ్మద్ సాధిక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎం ప్రద్యుత్‌కుమార్, డాక్టర్ బి.బ్రహ్మం, లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు కృషి చేయాలి : జిల్లా లెప్రసి అధికారి

కుష్ఠు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా లెప్రసి అధికారి డాక్టర్ మహమ్మద్ సాధిక్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో గురువారం స్పర్శ జాతీయ కుష్ఠు నిర్మూలన పక్షోత్సవాలు, మహాత్మాగాంధీ 77వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డీపీఎమ్‌వో పీవీ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించి ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కుష్ఠు వ్యాధి నిర్మూలనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లెప్రసి హెచ్ఈవో బి.కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, ఉపాధ్యాయులు డాక్టర్ అడే బుజ్జి, డీఎస్‌వో మార్గరెట్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై గుదిబండలా జగన్ చేసిన అప్పులు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సలగల రాజశేఖరబాబు

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జగన్మోహనరెడ్డి చేసిన అప్పులు ప్రభుత్వానికి గుదిబండలా మారిందని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన 7నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి గత ప్రభుత్వ బకాయిలు రూ. 22వేల కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. దీనివల్ల అప్పులు కూడా పుట్టని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏడాదికి రూ. 71వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం పెట్టనంతగా జగన్ ప్రభుత్వంలో 1.40లక్షల కోట్లు బకాయి ఉందన్నారు. తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం వంటి వాటిపై కాకుండా విలాసాలు, జల్సాలకు ఖర్చు చేసి అరగించారన్నారు. ఐదేళ్ళ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

నగరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అలపర్రు పంచాయతీ కట్టవ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో జాతీయ మహాత్మాగాంధీ ఉపాధి పథకం ద్వారా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వచ్చిన నిధులు అలాగే పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామప్రజలు గతంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి డీఎప్‌పీవో శివన్నారాయణ గురువారం గ్రామాన్ని సందర్శించారు. సంబంధిత నిధుల దుర్వినియోగం జరిగిందని, గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగకుండా గత వైసీపీ ప్రభుత్వంలో నిధులు సొంతపనులకు వాడుకున్నారని అధికారుల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ చేపట్టి సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం నివేదిక సమర్పిస్తామని అధికారికంగా తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి బొర్రా శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాలు ఉంచాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జేబీ శ్రీధర్

బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేబీ శ్రీధర్ కోరారు. ఈ విషయమై గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ప్రస్తుత గ్రంథాలయంలో గ్రూప్-2 మెయిన్స్‌కు సంబంధించిన పుస్తకాలు ఉండేవిధంగా చూడాలన్నారు. పోటీ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తూ స్టడీ మెటీరియల్ అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు మామిడి బత్తుల అశోక్, కోట నాగరాజు, నాగసాయి, మోహనగోపి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమల్లో కూటమి ప్రభుత్వం వెనకడుగు

● రేపల్లె నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమల్లో కూటమి ప్రభుత్వం వెనకడుగు వేస్తుందని రేపల్లె నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్ ఆరోపించారు. గురువారం గుళ్ళపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తానని, సంపద సృష్టిస్తానని చెప్పి సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రజలను మోసగించారని అన్నారు. సూపర్‌సిక్స్ హామీల్లో పించన్ పెంపుదల ఒక్కటి జరిగిందనీ, మిగతావి అమలు చేయలేదని చెప్పారు. 2019లో ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలు చేశారని అన్నారు. వలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇస్తామని మోసం చేశారని, ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని విమర్శించారు. మోసపూరిత హామీలకు కూటమి ప్రభుత్వంలోని మూడు పార్టీలు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దుండి బగ్గారెడ్డి, అంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు.. సవాళ్లు..

ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్ యార్డుగా పేరుగాంచిన గుంటూరు మిర్చియార్డులో సమస్యలు నిత్య నూతనమే. ప్రభుత్వాలు, పాలక మండళ్లు మారుతున్న ప్రతిసారీ ఏవో కొన్ని చిన్నచిన్న ఉపశమన, ఉద్దీపన చర్యలే మినహా ఏ సమస్యను వ్యవస్థాగతంగా సమూలంగా నిర్మూలించింది లేదు. దీంతో మిర్చియార్డుకి వచ్చిన రైతు తన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకొని బయటికి వెళ్లింది లేదు. అలాగే మిర్చియార్డులో పనిచేస్తున్న వందలాది మంది అసంఘటిత రంగ కార్మికులు వారి హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. రైతుల కష్టం, కార్మికుల శ్రమపై ఆధారపడి సాగుతోన్న కోట్లాది రూపాయల వ్యాపారంలో కమీషన్ వ్యాపారులు, ఎగుమతిదారులే లబ్ధిపొందు తుంటారనేది బహిరంగ రహస్యమే! ఈ పరిస్థితుల నేపథ్యంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)కి ఉన్నతశ్రేణి కార్యదర్శిగా చంద్రిక నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.





నేడు బాధ్యతలు స్వీకరించనున్న చంద్రిక..

మిర్చియార్డు (వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు) ఉన్నతశ్రేణి కార్యదర్శిగా చంద్రిక శుక్రవారం మిర్చియార్డు పరిపాలన భవనంలో బాధ్యతలు స్వీకరించనున్నారని యార్డు అధికారవర్గాలు ధ్రువీకరించాయి. చంద్రిక మునిసిపల్ పరిపాలన శాఖలో స్పెషల్ గ్రేడ్ కమిషనర్ హోదాలో ఉన్నారు.



- మిర్చియార్డులో జోరుగా జీరో వ్యాపారం..
- రైతుల కష్టాన్ని దోచేస్తున్న 'మచ్చు'
- కొత్త లైసెన్సుల కోసం రాజకీయ ఒత్తిళ్లు
- రైతులను ముంచుతున్న వ్యాపారులు
- సీజన్‌లో యార్డుని ముంచెత్తుతున్న మిర్చి
- తప్పని ట్రాఫిక్ కష్టాలు..
- నేడు నూతన సెక్రటరీ బాధ్యతల స్వీకారం..

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిపాలన శాఖ నుంచి డిప్యూటేషన్‌పై నేడు మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించ నున్న చంద్రిక ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ ఏడాది మిర్చి సీజన్ కొద్ది రోజుల క్రితమే ప్రారంభమైంది. ఇప్పటికే రోజుకు లక్ష మిర్చి టిక్కీల వరకు రాక ప్రారంభమైంది. ఈనామ్ పేరుకు ఆన్‌లైన్ ట్రేడింగ్ అయినప్పటికీ ఆఫ్‌లైన్‌లోనే కొనసాగుతోంది. యార్డులోకి వచ్చే లారీల్లో మిర్చి టిక్కీలకు లాట్ ఐడీలు జనరేట్ చేయడంలోనే జాప్యం జరుగుతోంది. ఒక వాహనంలో వచ్చే టిక్కీలు ఒక దుకాణం వద్ద కాకుండా వేర్వేరు దుకాణాల వద్ద రైతులు దింపుతుండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఫిబ్రవరి 15వ తేదీ తర్వాత రోజుకు రెండు లక్షల టిక్కీలకు పైగా యార్డులో విక్రయానికి వస్తాయి. ఇక పీక్ సీజన్ అయిన మార్చి, ఏప్రిల్‌లో మూడు లక్షల టిక్కీల వరకు కూడా వస్తాయి. ఈ నేపథ్యంలో ఎరైవల్స్, సేల్స్ సాఫీగా జరిగితేనే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావు. లేకుంటే రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగే పరిస్థితులు ఉత్పన్నం అవుతాయి. ముఖ్యంగా ఈనామ్‌లో ట్రేడింగ్ అయిన మిర్చి టిక్కీలు వెంటనే కాటాలు అయి సాయంత్రం లోపే బయటకు వెళ్లిపోవాలి. లేకుంటే రాత్రి 8 గంటల నుంచి కొత్త సరుకు రావడం ప్రారంభమౌతుంది. అప్పుడు యార్డులో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. యార్డులో కమీషన్ దుకాణాల ఎదుట పసుపు, ఎరుపు గీతల విధానం అమలులో ఉన్నది. ఎట్టి పరిస్థితుల్లో మిర్చి టిక్కీలు ఎర్రరంగు గీత వరకు రాకుండా చూస్తేనే వాహనాల రాకపోకలు సాగుతాయి.

బిడ్డింగ్‌లో కేవలం ఒకరు, ఇద్దరు మా త్రమే వేస్తుంటారు. దీంతో పోటీ అనేది ఉండదు. కమీషన్ వ్యాపారి ఎంత చెబితే అంత ధరకు రైతు ఎగుమతిదారుడికి విక్రయించాల్సిందే. యార్డులో పేరుకు 680 మంది కమీషన్ వ్యాపారస్థులున్నప్పటికీ వారిలో ట్రేడింగ్ జరిపేది 100 నుంచి 200 మంది మాత్రమే. మిగతా వ్యాపారస్థులు నామమాత్రంగానే వ్యాపారం చేస్తుంటారు.

ఉచిత భోజనం సగం మంది రైతులకే ..

మిర్చియార్డుకి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నుంచే కాకుండా ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా రైతులు మిర్చిని తీసుకొస్తుంటారు. ఆయా సందర్భాల్లో మిర్చియార్డులో రైతులు విశ్రాంతి తీసుకోవడానికి భవనాలు ఉన్నాయి. రైతులు ఆహారానికి ఇబ్బంది పడకూడదని ఏటా సీజన్‌లో ఉచితంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. అయితే ఈ టోకెన్ల జారీ విషయంలో అక్రమాలు జరుగుతున్నాయి. రైతులు కంటే ప్రైవేటు వ్యక్తులు ఎక్కువ మందికి టోకెన్లు జారీ చేస్తున్నారన్న విషయం బహిరంగ రహస్యమే. దీని మీద అధికారులు చర్యలు చేపడితే వెంటనే వివిధ యూనియన్ల వారు, వారి అనుచరులను రెచ్చగొట్టి ఆందోళనలు చేయించడం చేస్తుంటాయి. ఇలా అరకొరమంది రైతులకు అల్పాహారం, భోజనం అందుతోంది.

గత ఏడాది మహిళ సెక్యూరిటీ గార్డులు మచ్చుకాయలు తీసుకెళుతున్న వారిని అడ్డుకొంటే యూనియన్ నాయకులు హమాలీలను రెచ్చగొట్టి నానా యాగీ చేసి ఆ సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలు తీసేయించాయి.

జోరుగా జీరో వ్యాపారం ..

మిర్చియార్డులో బిల్ టూబిల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. కమీషన్ వ్యాపారి వద్ద ఎలాంటి పెట్టుబడి ఉండదు. అతను వేరే ఫరం మీదకు తన వద్దకు వచ్చిన మిర్చి టిక్కీలను మార్పు చేస్తాడు. ఇందుకు రైతు వద్ద 2 శాతం కమీషన్‌కు బదులుగా నాలుగైదు శాతం వసూలు చేస్తారు. దీని వలన రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు.

● మిర్చియార్డులో జీరో వ్యాపారం ఒకటి వేళ్లూను కొని ఉంది. యార్డులోకి ప్రవేశించిన సరుకుని ఈనామ్‌లో ఎంట్రీ కాకుండానే ట్రేడింగ్ జరిపించేసి బయటకు పంపేస్తారు. ఇది సూపర్‌వైజర్లకు తెలియకుండా జరిగే అవకాశమే లేదన్నది బహిరంగ రహస్యమే. దీని వలన ఏటా మిర్చియార్డు రూ. కోట్లలో మార్కెట్ ఫీజు రూపంలో ఆదాయాన్ని కోల్పోతోంది.

● రేట్ కటింగ్ బిజినెస్ కూడా మార్కెటింగ్ శాఖ ఆదాయానికి గండి కొడుతోంది. రైతుకు చెల్లించేది ఒక ధర, ఈనామ్‌లో ఎంట్రీ చేసే ధర అంతకంటే తక్కువగా చూపిస్తారు. దీని వలన అటు ఎక్స్‌పోర్టరు, ఇటు కమీషన్ వ్యాపారి మాత్రమే లాభ పడతారు. మార్కెటింగ్ శాఖకు ఒక శాతం ఫీజు రూపంలో ఆదాయం కోల్పోతోంది.

● సీజన్ వచ్చిందంటే కమీషన్, ఎక్స్‌పోర్టు వ్యాపారస్థుల గుమాస్తాలకు పండగే. రైతులు తీసుకొచ్చే మిర్చి టిక్కీల నుంచి మచ్చుకాయలు(శాంపిల్స్) తీస్తారు. ఆ కాయలను తిరిగి రైతుల మిర్చి టిక్కీల్లో పోయరు. బయటకు తీసుకెళ్లి ఎంచక్కా అమ్ముకొంటారు. ఒక్కో సీజన్‌లో ఒక్కో గుమాస్తా రూ. లక్షల్లోనే వెనకేసుకొంటాడని నానుడి.

యథేచ్ఛగా వ్యాపారుల అక్రమాలు..

ఇటీవలకాలంలో అటు కమీషన్, ఇటు ఎగుమతిదారులు, కోల్డ్‌స్టోరేజీల యజమానులు అనేక అక్రమాలకు పాల్పడిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. రైతులు వద్ద సరుకు తీసుకోవడం రూ. కోట్లలో ఐపీ పెట్టిన సంఘటనలపై కేసులు కూడా నమోదయ్యాయి. అలానే రైతులకు తెలియకుండా కోల్డ్‌స్టోరేజీల నుంచి సరుకు మాయం చేసిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఆయా ఘటనల్లో బాధిత రైతులు కేసులు పెట్టడం మినహా వారికి న్యాయం జరిగింది లేదు.



సాగు.. తారుమారు

(5వ పేజీ తరువాయి)

తీవ్ర ప్రభావం చూపాయి. పైగా పంటకు మార్కెట్‌లో ధర లభించలేదు. ధర పతనమవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మిరప సాగుకు వేలాది మంది రైతులు దూరమయ్యారు. గత ఏడాది మూడు జిల్లాల్లో 1,71,226 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది 1,15,422 ఎకరాలకు మిరప సాగు పరిమిత మైనట్లు ఉద్యాన శాఖ గణాంకాలు చెబుతున్నాయి. క్రితం సారి కన్నా దాదాపు 55,804 ఎకరాల్లో మిరప సాగు తగ్గింది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో పాటు నల్ల తామరతో దిగుబడులు తగ్గడంతో నష్టపోయిన రైతులు ఈ సారి మిరప సాగుకు దూరమయ్యారు. మార్కెట్‌లో మిరప క్వింటాల్ రూ.12 వేల నుంచి రూ.13 వేలు ఉందని రైతులు చెబుతున్నారు. క్రితం సంవత్సరం కన్నా క్వింటాకు రూ.6 వేల వరకు ధర తగ్గిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మిరపకు గిట్టుబాటు ధర కల్పిం చాలని రైతులు కోరుతున్నారు. మిరపకు ధర కల్పించాలని సీఎం చంద్రబాబును రైతుల పక్షాన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఆయన సానుకూలంగా స్పందించ డంతో ప్రభుత్వం సాయం అందిస్తుందని మిరప రైతులు ఆశపడుతున్నారు. ప్రభుత్వం మిరప రైతుల సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

గణనీయంగా పెరిగిన మొక్కజొన్న.. పొగాకు సాగు

మిరప గిట్టుబాటు కాకపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపారు. దీంతో మొక్కజొన్న, పొగాకు పంటల సాగు గణనీయంగా పెరిగింది. అంచనాలను తారుమారు చేస్తూ గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడు పొగాకు సాగు పెరిగింది. మిరపతో పాటు శనగ సాగు కూడా గణనీయంగా తగ్గింది. గత ఏడాది శనగ సాగు కలిసిరాకపోవడంతో సదరు రైతులు మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు.

మంగళగిరి చేనేతకు జీవం

(5వ పేజీ తరువాయి)

కంచి సిల్క్ పార్కు తరహాలో ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ చేనేతపార్కుతో మంగళగిరిలో మళ్లీ చేనేతకు కొత్తజీవం పోసుకోబోతుందనడంలో సందేహం లేదు. చేనేతపార్కు అంటే..పచ్చి నూలు మొదలు చీర తయారీ మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా ఇక్కడి నుంచే ఏర్పాటు చేస్తారు. మంగళగిరి వస్త్రాలకు గిరాకీ పెంచే ఉద్దేశ్యతో కంచి చేనేతపార్కు తరహాలో దీనికి సిల్కును కూడా జోడించాలని మంత్రి సవిత సూచించారు.

ప్రస్తుతం మగ్గాల సంఖ్య 1400

మంగళగిరిలో ప్రస్తుతం మగ్గాల సంఖ్య 1400. రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ఆరు భారీ షెడ్లను ఏర్పాటుచేసి 146 ఫ్రేమ్ మగ్గాలను నేత కార్మికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రత్నాలచెరువులో 520 మగ్గాలు, ఇందిరానగర్, పాతమంగళగిరి కలిపి 350 మగ్గాలు, ఆత్మకూరులో 60, ఎర్రబాలెంలో 225, తాడేపల్లిలో ఎనిమిది, చినకాకానిలో 20, కాజలో ఆరు, నవులూరులో సుమారు వంద వరకు మగ్గాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటు కాబోతున్న మెగా చేనేతపార్కులో వేయికిపైగా ఫ్రేమ్ మగ్గాలను ఏర్పాటుచేస్తారని అంచనా వేస్తున్నారు. ఈ పార్కు ఏర్పాటుతో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సుమారు ఐదారు వేలమందికి ఉపాధి కలగనుంది. ఇక ఈ పార్కులో యారన్ డిపో, అడ్మినిస్ట్రేటివ్, రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ భవనాలు, డిస్పెన్సరీ, క్యాంటీన్, కాఫీషాపు, మార్కెటింగ్ కాంప్లెక్స్, వర్క్‌షాపు, వేర్ హౌస్, కాన్ఫరెన్స్‌హాలు, ఆడియో వీడియో సెంటర్, విశ్రాంతి భవనం, వే బ్రిడ్జి, సెక్యూరిటీ భవనం, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్, ఎక్విప్‌మెంట్ అండ్ ఫర్నిచర్ ఫర్ టెస్టింగ్ అండ్ ట్రైనింగ్ సెంటర్, సిల్క్ ఈటీపి, కాటన్ ఈటీపీ తదితరాలను ఏర్పాటు చేస్తారు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

● సీఎం కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి

గుంటూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రిని కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ. 3 వేల నుంచి రూ.15 వేలకు పెంచాలని కోరారు. సర్పంచులు విధి నిర్వహణలో మరణిస్తే రూ. 20 లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని, గిరిజన తండాలను ప్రత్యేకంగా పరిగణించి ప్రత్యేక నిధులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



సీఎం చంద్రబాబుకి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ వీరాంజనేయులు

టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధికి రూ.25 లక్షల విరాళం



నారా లోకేశ్ రూ. 25 లక్షల చెక్కును అందజేస్తున్న టీడీపీ నేత మాదాల చైతన్య

గుంటూరు(తూర్పు), జనవరి 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధికి ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకుడు మాదల చైతన్య రూ.25 లక్షల విరాళాన్ని ప్రకటించారు. గురువారం ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసంలో ఆయనకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాదాల చైతన్య మాట్లాడుతూ కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ఏకైక పార్టీ టీడీపీయేనని అన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం నిరంతరం కష్టపడు తున్న చంద్రబాబుకు, లోకేశ్‌కు తాము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా చైతన్యను లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు.



డీఈవోకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

తరగతుల తరలింపు విరమించుకోవాలి

గుంటూరు (విద్య) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3,4,5 తరగతులు తరలించి కేవలం 1,2 తరగతులు ఉంచి ఫౌండేషన్ స్కూల్‌గా మార్చడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కళాధర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో సీవీ రేణుక వినతిపత్రం అందజేశారు. అనంతరం కళాధర్ మాట్లాడుతూ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఫౌండేషన్ స్కూల్ విధానం రాష్ట్రంలో విఫలమైందని, ఈ ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం గోవిందు, కె రంగారావు, ఎం కోటి రెడ్డి తదితరుడు పాల్గొన్నారు.

టమోరా!





- భారీగా పడిపోయిన ధర
- హోల్‌సేల్‌లో కిలో రూ. 10, రిటైల్‌లో రూ.20
- ఇదే బాటలో క్యాలీఫ్లవర్, వంకాయ, ములక్కాయ
- పెరిగిన దోసకాయ, బెండకాయలు..

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో ఒకప్పుడు అధిక ధరతో దడపుట్టించిన టమోటా ధర ప్రస్తుతం పడిపోయింది. టమోటా ప్రస్తుతం హోల్‌సేల్‌లో కిలో రూ.10లకు విక్రయిస్తుండగా రిటైల్ చిల్లర దుకాణాల్లో రూ. 20లకు విక్రయిస్తున్నారు. టమోటా పంట దిగుబడి గణనీయంగా పెరగటం, స్థానిక టమోటా పంట ఉత్పత్తులు మార్కెట్‌కు రావటంతో ధరలు ఒక్కసారిగా దిగజారిపోయాయి. రైతుబజారులో టమోటా కిలో రూ. 13కు విక్రయిస్తుండగా పెద్ద మార్కెట్లో కిలో రూ. 15 నుంచి రూ. 20 వరకు విక్రయిస్తున్నారు. క్యాలీఫ్లవర్ గత నెలలో ఒకటి రూ. 50 లనుంచి రూ. 40 ధర ఉండగా ప్రస్తుతం రూ. 20లకు లభిస్తుంది. ములక్కాయ కూడా గత నెలలో ఒకటి రూ. 30 విక్రయించగా దిగుబడి పెరగటం , స్థానికంగా పంట కూడా మార్కెట్‌కు రావటంతో రూ. 20లకు చేరుకుంది. వంకాయలు కూడా కిలో గత నెలలో రూ. 60లు ఉంటే ప్రస్తుతం రూ. 40లకు దగ్గింది. బంగాళదుంపలు కూడా కిలో రూ. 45 లు గత నెలలో ఉంటే ప్రస్తుతం కిలో రూ. 30లకు తగ్గినట్లు చెబుతున్నారు. ఇక క్యారెట్ కూడా ధరలు తగ్గిన జాబితాలో చేరాయి.



క్యారెట్ కిలో రూ. 60లు ఉంటే ప్రస్తుతం రూ. 40లకు దగివచ్చింది.

పెరిగిన బెండ, దోస ధరలు..

ఇక కొన్ని రకాల కూరగాయలు ధరలు తగ్గితే మరికొన్ని కూరల ధరలు మండుతున్నాయి. బెండకాయలు గత నెలలో కిలో రూ. 20ల నుంచి రూ. 30లకు విక్రయించగా ప్రస్తుతం అవి కాస్త అమాంతం కిలో రూ. 60లకు చేరుకున్నాయి. పంట దిగుబడి తగ్గటం, స్థానికంగా కూడా పంట ఉత్పత్తి పెద్దగా లేకపోవటంతో మార్కెట్లో ధరలు పెరిగాయని కూరగాయల వ్యాపారి రాపోలు మల్లికార్జునరావు తెలిపారు. దోసకాయల ధరల పరిస్థితి కూడా అదే బాటలో ఉంది. దోస గత నెలలో కిలో రూ. 30 ఉంటే ప్రస్తుతం రూ. 60లకు ఎగబాకింది. దాంతో కొనుగోలుదారులు దోసకాయలంటేనే వెనుకాడుతున్నారు. ఇక పచ్చి మిర్చి, కాకర ఇతర కూరగాయాలన్నీ సాధారణ ధరలే కొనసాగుతున్నాయి. టమాటా ధర ఇలాగే కొనసాగితే తాము తీవ్రంగా నష్ట పోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆహారం కోసం కొంగల విన్యాసాలు..

గుంటూరు రూరల్ మండలం లింగాయపాలెం చెరువులో గేదెలపై విన్యాసాలు చేస్తున్న కొంగలివి. గేదెలపై వాలిన క్రిమి కీటకాలను తింటూ ఆకలి తీర్చుకునేందుకు కొంగలు చేస్తున్న విన్యాసాలు చూపరులకు ఆకర్షణీయంగా ఉన్నా గేదెలకు మాత్రం ఇబ్బందికరంగా ఉంటుంది.











వలపర్ల, రామకూరు మధ్య గోతులమయంగా మట్టిరోడ్డు

రెండు గ్రామాలు.. రెండు మండలాలు

» నియోజకవర్గాలను కలిపే ఈ రహదారిని పట్టించుకోండి మహాప్రభో

మార్టూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రెండు గ్రామాలను.. కాదు రెండు మండలాలను.. కాదు కాదు ఏకంగా రెండు నియోజకవర్గాలను కలిపే రహదారి ఇది. ఈ రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. అంతా మట్టిరోడ్డు, అక్కడక్కడా భారీగా గుంతలు ఏర్పడ్డాయి. గత కొన్నేళ్ల నుంచి ఈ రహదారిని పట్టించుకునేవారే కరువయ్యారు. పర్చూరు నియోజకవర్గంలో మార్టూరు మండలం వలపర్ల గ్రామం నుంచి, అద్దంకి నియోజకవర్గంలోని జె.పంగులూరు మండలం రామకూరు గ్రామాన్ని కలిపే రహదారి. ఈ రెండు గ్రామాల మధ్య దూరం కేవలం రెండు కలోమీటర్ల లోపే. దానిలో కొంతభాగం వలపర్ల గ్రామ పంచాయతీలో, మరి కొంతభాగం రామకూరు గ్రామ పంచాయతీలో ఉంది. రోజూ ఈ రహదారి గుండా రెండు గ్రామాలకు చెందిన ప్రజలు అటు ఇటు రాకపోకలు సాగిస్తుంటారు. రామకూరుకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు రోజూ వలపర్ల జడ్పీ హైస్కూల్‌కు వస్తుంటారు. ఇక చిలకలూరిపేట, అద్దంకి ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు రామకూరు, వలపర్ల గ్రామాల మీదగా రోజూ నాలుగైదుసార్లు అద్దంకి చి, లకలూరిపేటలకు ప్రయాణికులను చేరవేస్తుంటాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారిని పట్టించుకున్నవారు లేరని రెండు గ్రామాలకు చెందిన గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం ఏదోలా ప్రయాణిస్తున్నా, వర్షాకాలంలో లేదా మోస్తరు వర్షం కురిసిందంటే ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయమేనని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు రెండు గ్రామాల నాయకులుకు, మండల స్థాయి నేతలుకు ఈ రోడ్డు పరిస్థితిని గురించి అవగతమే. కానీ ఇంతవరకు రోడ్డు రూపురేఖలు మారలేదు. మరి రెండు నియోజకవర్గాల శాసనసభ్యులైనా రోడ్డుపై ఓ కన్నేస్తే బాగుంటుందని, కూటమి ప్రభుత్వం వచ్చింది కదా రోడ్డు బాగుపడుతుందిలే అని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి ఖర్చులకు రూ.15వేలు

» హర్షం వ్యక్తం చేసిన తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ సభ్యులు



సీఎంకు థ్యాంక్స్ చెప్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అద్దంకిటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేసేవారు చనిపోతే మట్టి ఖర్చులకు రూ.15వేలను ప్రకటిస్తూ కూటమి ప్రభుత్వం జీవో చేయడంపట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అద్దంకిలో తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు మట్టి ఖర్చుల జీవో జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ థ్యాంక్యూ సీఎం సార్ అంటూ పూలతో ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అంగన్‌వాడీల జీతాల కోసం, ఇతర సమస్యల పరిష్కారం కోసం రోజుల తరబడి దీక్షలు చేసినా పట్టించుకోలేదన్నారు. మట్టిఖర్చుల పథకాన్ని వారు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో ప్రశాంత వాతావరణం, అంగన్‌వాడీల సమస్యల కోసం ప్రభుత్వం చూపిన చొరవతో ప్రతి నెల 1వ తేదీనే జీతాలు అందుతున్నాయన్నారు. అలాగే పని భారాన్ని తగ్గించినందుకు కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు ధనలక్ష్మి, జె. లీలా, టీ పార్వతి, టి.సుబ్బమ్మ, చంద్రమతి, శ్రీలక్ష్మి, జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లు పాల్గొన్నారు.

నేడు మేదరమెట్లలో మంత్రి పర్యటన

మేదరమెట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలు కార్యక్రమాలల్లో పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మేదరమెట్లలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, ఎస్టీ కాలనీలో కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన, సీసీ కెమెరాలను ప్రారంభోత్సవం చేయనున్నారు.

సాగు.. తారుమారు

(5వ పేజీ తరువాయి)

తీవ్ర ప్రభావం చూపాయి. పైగా పంటకు మార్కెట్‌లో ధర లభించలేదు. ధర పతనమవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మిరప సాగుకు వేలాది మంది రైతులు దూరమయ్యారు. గత ఏడాది మూడు జిల్లాల్లో 1,71,226 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది 1,15,422 ఎకరాలకు మిరప సాగు పరిమితమైనట్లు ఉద్యాన శాఖ గణాంకాలు చెబుతున్నాయి. క్రితం సారి కన్నా దాదాపు 55,804 ఎకరాల్లో మిరప సాగు తగ్గింది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో పాటు నల్ల తామరతో దిగుబడులు తగ్గడంతో నష్టపోయిన రైతులు ఈ సారి మిరప సాగుకు దూరమయ్యారు. మార్కెట్‌లో మిరప క్వింటాల్ రూ.12 వేల నుంచి రూ.13 వేలు ఉందని రైతులు చెబుతున్నారు. క్రితం సంవత్సరం కన్నా క్వింటాకు రూ.6 వేల వరకు ధర తగ్గిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. మిరపకు ధర కల్పించాలని సీఎం చంద్రబాబును రైతుల పక్షాన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో సాయం అందిస్తుందని మిరప రైతులు ఆశపడుతున్నారు.

గణనీయంగా పెరిగిన మొక్కజొన్న.. పొగాకు సాగు

మిరప గిట్టుబాటు కాకపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపారు. దీంతో మొక్కజొన్న, పొగాకు పంటల సాగు గణనీయంగా పెరిగింది. అంచనాలను తారుమారు చేస్తూ గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడు పొగాకు సాగు పెరిగింది. మిరపతో పాటు శనగ సాగు కూడా గణనీయంగా తగ్గింది. గత ఏడాది శనగ కలిసిరాకపోవడంతో మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు.

అన్న క్యాంటీన్‌లో మందుబాబులకు నో ఎంట్రీ

రూ.5లకే పేదల ఆకలి తీర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే కొందరు మద్యం సేవించి క్యాంటీన్‌కి వచ్చి సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై నిర్వాహకులు కొన్ని నిబంధనలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. మద్యం సేవించి వచ్చేవారికి క్యాంటిన్‌లో ప్రవేశం లేదనే బోర్డును ఏర్పాటు చేశారు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని అన్న క్యాంటిన్‌లో ఇలా బోర్డు ఏర్పాటు చేయడంతో ప్రతి ఒక్కరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో నగరంలోని అన్నీ అన్న క్యాంటీన్‌లలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం

- ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

సాగర్ కాలువపై ప్రమాదకరంగా బ్రిడ్జిలు

» పడిపోయిన రక్షణ గోడలు

» కాలువ పక్కన రోడ్డుపై భయంకరంగా మలుపులు, గుంతలు

» ఏళ్లతరబడి ఇదే తంతు » ఇకనైనా మరమ్మతులు చేయరా?

మార్టూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ జవహర్ కాలువ మార్టూరు మండల పరిధిలో కోనంకి సబ్‌డివిజన్ పరిధిలో సాగర్ కాలువపై ప్రమాదకరమైన పరిస్థితులలో బ్రిడ్జిలు ఉన్నాయి. ఎంతో కాలం నుంచి ఈ బ్రిడ్జిలకు రక్షణ గోడలు లేకపోయినా, పడిపోయినా వాటి మరమ్మతులకు ఆయా ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయలేదు. దానికితోడు సాగర్ కాలువ పక్కనే ఉన్న తారురోడ్డుపై అక్కడక్కడా ప్రమాదకరైన గుంతలు ఏర్పడినా, వాహనాలు అదుపుతప్పితే పక్కనే ఉన్న సాగర్ కాలువలోకి వాహనాలు దూసుకుపోయే అవకాశం ఉన్నా రక్షణచర్యలు చేపట్టేవారు కరువయ్యారు. కాలువపై ప్రస్తుతం ఉన్న బ్రిడ్జిలు గతంలో రైతువారీ అవసరాలు కోసం అప్పటి నాయకులు సహకారంతో ఏర్పాటు చేసినవి. ప్రస్తుతం పెరిగిన జనాభా అవసరాలు నిమిత్తం, రవాణా సౌకర్యాలుగా వివిధ వాహనదారులు ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు కూడా ఈ బ్రిడ్జిపై నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. తప్పని సరిగా టీడీపీ కూటమి ప్రభుత్వమైనా సాగర్ కాలువపై ఉన్న బ్రిడ్జిల మరమ్మతులకు, రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రమాదకరమైన వలపర్ల - రామకూరు 36-3 బ్రిడ్జి

రెండు మండలాలకు, రెండు గ్రామాలకు వారధిగా సాగర్ కాలువపై మార్టూరు మండలం వలపర్ల జె.పంగులూరు మండలం రామకూరు గ్రామాల మధ్య 36-3 బ్రిడ్జి ప్రజల రాకపోకలకు, వాహనాలు ప్రయాణానికి ప్రమాదకరంగా ఉంది. అద్దంకి డిపో నుంచి ఆర్టీసీ బస్సులు వలపర్ల మీదగా చిలకలూరిపేట, ఇంకొల్లు వెళ్లేందుకు ఈ బ్రిడ్జిపై నుంచి ప్రమాదకరంగా రోజూ ప్రయాణం చేస్తుంటాయి. ఇక రైతువారీ రోజూ ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు అధికంగా ఉంటారు. గతంలో ఈ బ్రిడ్జిపై నుంచి వాహనదారులు సాగర్ కాలువలో పడిపోయిన సందర్భాలు ఉన్నాయి.



వలపర్ల - రామకూరు మధ్య సాగర్ కాలువపై ప్రమాదకరంగా రక్షణ గోడలు లేకుండా ఉన్న 36-3 బ్రిడ్జి

లక్కవరం 37-3 బ్రిడ్జిపై తరచూ ప్రమాదాలు

యద్దనపూడి బ్రాంచి కెనాల్‌పై పమిడిపాడు మేజరు వద్ద బొల్లాపల్లి టోల్‌ప్లాజా వైపు నుంచి లక్కవరం, రామకూరు గ్రామాలకు వెళ్లేందుకు 37-3 బ్రిడ్జిని దాటి వెళ్లాల్సిందే. ఈ బ్రిడ్జిమీద ప్రయాణం అత్యంత ప్రమాదకరం. కనీసం బ్రిడ్జిపై 10 అడుగుల దూరం కూడా రోడ్డు వెడల్పు ఉండదు. దాంతో ఏ మాత్రం వాహనదారుడు అప్రమత్తంగా ఉంటే వాహనం సాగర్ కాలువలో పడిపోతుంది. గతంలో ఒక ట్రాక్టరు సాగర్ కాలువలో పడిపోవడంతో ఇద్దరు యువకులు ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. రాత్రి సమయాలలో ఈ బ్రిడ్జిపై ప్రయాణం మరింతప్రమాదంగా ఉంటుంది. ఇంకా చిమ్మిరిబండ, ద్రోణాదుల గ్రామాల మధ్య నూతలపాడు మైనరు కాల్వపై కూడా రక్షణ గోడలు లేక బ్రిడ్జిపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. ద్రోణాదుల గ్రామంలో నాగండ్ల వెళ్లే రోడ్డులో మైనరు కాల్వపై ఎలాంటి రక్షణ లేకపోవడంతో ఎక్కువగా ద్విచక్రవాహనదారులు, పశువులు కాలువలో పడిపోయిన సందర్భాలు ఉన్నాయి.

ప్రయాణం ప్రమాదకరం

సాగర్ కాలువ పక్కనే ఉన్న తారురోడ్డులో ఎక్కువగా కంకర లారీలు, ట్రాక్టర్లు రోజూ తిరుగుతుండడంతో రోడ్డుపై గుంతలు పడుతున్నాయి. వాటిని గమనించకుండా వెళ్లే ద్విచక్రవాహనదారులు, కార్లు ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నాయి. బొల్లాపల్లి జీఎన్‌టి రోడ్డుకు వలపర్ల, లక్కవరం, రామకూరు గ్రామాల నుంచి కార్లలో ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డులోనే ప్రమాదకరంగా, వెడల్పు తక్కువగా ఉన్న రోడ్డు మలుపు ఉంది. అక్కడ పట్టపగలు ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురైన సందర్భాలు ఉన్నాయి. అలాగే ఈ మలుపు వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా రోడ్డు పక్కన ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో



లక్కవరం వెళ్లే దారిలో కాలువపై ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

సాగర్ నీటిలోకి వాహనాలు పడిపోయే అవకాశం ఉంది. సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగర్ నీరు సక్రమంగా అందకపోవడం, కోనంకి ఎన్నెస్పీ పరిధిలో కాలువకు సమృద్ధిగా నీళ్లు రాకపోవడంతో అడపాదడపా ప్రమాదాలు జరిగినా కాలువలో భారీ స్థాయిలో నీటి ప్రవాహం లేకపోవడంతో చాలా మంది ప్రాణాలతో బయటపడిన సందర్భాలు ఉన్నాయి.



ద్రోణాదుల మేజర్ కాలువపై చిమ్మిరిబండ వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి



బొల్లాపల్లి నుంచి లక్కవరం వైపు వెళ్లే రోడ్డులో ఏర్పడిన భారీ గుంత



బొలాపల్లి జీఎన్‌టీ సమీపంలో సాగర్ కాలువ పక్కనే రోడ్డుపై రక్షణ లేకుండా ఉన్న ప్రమాదకరమైన మలుపు

మన ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

చీరాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మన ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అన్నారు.

సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో క్యార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.జగదీష్ తెలిపారు. గురువారం కళాశాలలో 15 మినిట్స్ ఆఫ్ సిటీ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా పూర్వ విద్యార్థి, ఎస్ఐటీ రీసెర్చ్ స్కాలర్ అనిల్ రాజ్ కుమార్ హాజరై ఉపన్యసించారు. ప్రతి వ్యక్తి ఇంటి నుంచి 15 నిమిషాలలో స్కూల్స్, హాస్పిటల్స్, మార్కెట్స్, పార్క్‌లు ఇతర అవసరాలు పొందగలగడం వలన ట్రాఫిక్, కాలుష్యం వివిధ రకాల హానికర వంటి వాటని నియంత్రించవచ్చన్నారు. జనాభా పెరుగుతున్న క్రమంలో జీవన మనుగడకు ప్రతి ఒక్కరూ మార్గాలకు బాటలు వేయాలన్నారు. అనంతరం స్కాలర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి విజయ, కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థి అనిల్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు

» దేశంలో తొలిసారిగా వాట్సాప్‌తో సేవలు

» 161 రకాల పౌరసేవలను అందించేందుకు శ్రీకారం

» 9552300009 నెంబర్‌ను కేటాయించిన ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రజలకు సత్వర పౌరసేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాట్సాప్ గవర్నెన్స్‌కు చర్యలు తీసుకున్నారు. ఈ సేవలను ప్రజలు సత్వరం పొందేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం అధికారిక వాట్సాప్ నెంబరు 9552300009 నెంబర్‌ను ప్రకటించి లాఛనంగా ప్రారంభించారు. ప్రజలకు పౌరసేవలు అందివ్వడంతోపాటు ప్రజల నుంచి వినతులు కూడా స్వీకరించి వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. తొలిదశలో మొత్తం 161 రకాల పౌరసేవలను అందించనుంది. దేవదాయ, ఇంధన, ఏపీ ఎస్ఆర్టీసీ, రెవెన్యూ, మునిసిపల్ శాఖల్లో ఈ సేవలు ప్రారంభమవుతాయి. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వాట్సాప్ ద్వారానే పొందే విధంగా ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఇంకొకవైపు ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు కూడా ఈ వాట్సాప్‌నే వినియోగిస్తుంది. ప్రజలు ఏదైనా ఫిర్యాదులు ఇవ్వాలనుకుంటే ఈ నెంబర్‌కు మేసేజ్ చేస్తే వెంటనే వారికి ఒక లింక్ వస్తోంది. అందులో సంబంధిత వ్యక్తి పేరు, ఫోన్ నెంబరు, చిరునామా పొందుపరిస్తే సరిపోతుంది. వెంటనే వారికి రిఫరెన్స్ నెంబర్ కూడా వస్తుంది. దాని ఆధారంగా తాము ఇచ్చిన వినతి పరిష్కారం ఎంతవరకు వచ్చింది, ఎవరి వద్ద ఉందనేది కూడా తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు. మరోవైపు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అర్హతలు, పథకాల లబ్ధిపై కూడా ఈ వాట్సాప్ నెంబర్‌కు మేసేజ్ చేసి తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు.

విద్యుత్ బిల్లులు, పన్నులు చెల్లింపు

కాగా ఈ వాట్సాప్ ద్వారా విద్యుత్ బిల్లులు, ఆస్తిపన్నులు చెల్లించవచ్చు, ట్రేడ్ లైసెన్సులు కూడా పొందేందుకు అవకాశం కల్పించారు. దేవాలయాల్లో దర్శనాల స్లాట్ బుకింగ్, వసతి బుకింగ్, విరాళాలు పంపడం వంటివి చేయవచ్చు. రెవెన్యూ శాఖకు సంబంధించిన ల్యాండ్ రికార్డుల యాక్సెస్, వివిధ సర్టిఫికెట్లను కూడా పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ప్రతి ఒక్కరికి వద్ద సెల్‌ఫోన్

కాగా ప్రస్తుతం ప్రతి ఒక్కరి వద్ద స్మార్ట్ సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చింది. ఆ ఫోన్ ద్వారానే ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడం కూడా సులభతరం చేసింది. ఏ సమయంలోనైనా తమ సమస్యలను ఆ వాట్సాప్ ద్వారా చేస్తే వెంటనే ఆ సమాచారాన్ని సంబంధిత అధికారుల వద్దకు చేరుతుంది. తద్వారా సత్వరమే పౌరసేవలు పొందేందుకు ప్రభుత్వం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అమలు చేస్తుంది.

రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటిలో ఇరువురు తొలగింపు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ సీహెచ్.వెంకటేశ్వరరెడ్డిలను ఆ పదవుల నుంచి తొలగించారు. ఆ మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ సీఈవో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎకె. ఫరీదా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల నకలను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, రాష్ట్ర గవర్నర్‌కు పంపారు.

మంగళగిరి చేనేతకు జీవం

(5వ పేజీ తరువాయి)

కంచి సిల్క్ పార్కు తరహాలో ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ చేనేతపార్కుతో మంగళగిరిలో మళ్లీ చేనేతకు కొత్తజీవం పోసుకోబోతుందనడంలో సందేహం లేదు. చేనేతపార్కు అంటే...పచ్చి నూలు మొదలు చీర తయారీ మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా ఇక్కడి నుంచే ఏర్పాటు చేస్తారు. మంగళగిరి వస్త్రాలకు గిరాకీ పెంచే ఉద్దేశ్యతో కంచి చేనేతపార్కు తరహాలో దీనికి సిల్కును కూడా జోడించాలని మంత్రి సవిత సూచించారు.

ప్రస్తుతం మగ్గాల సంఖ్య 1400

మంగళగిరిలో ప్రస్తుతం మగ్గాల సంఖ్య 1400. రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో ఆరు భారీ షెడ్లను ఏర్పాటుచేసి 146 ఫ్రేమ్ మగ్గాలను నేత కార్మికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రత్నాలచెరువులో 520 మగ్గాలు, ఇందిరానగర్, పాతమంగళగిరి కలిపి 350 మగ్గాలు, ఆత్మకూరులో 60, ఎర్రబాలెంలో 225, తాడేపల్లిలో ఎనిమిది, చినకాకానిలో 20, కాజలో ఆరు, నవులూరులో సుమారు వంద వరకు మగ్గాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటు కాబోతున్న మెగా చేనేతపార్కులో వేయికిపైగా ఫ్రేమ్ మగ్గాలను ఏర్పాటుచేస్తారని అంచనా వేస్తున్నారు. ఈ పార్కు ఏర్పాటుతో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సుమారు ఐదారు వేలమందికి ఉపాధి కలగనుంది. ఇక ఈ పార్కులో యారన్ డిపో, అడ్మినిస్ట్రేటివ్, రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ భవనాలు, డిస్పెన్సరీ, క్యాంటీన్, కాఫీషాపు, మార్కెటింగ్ కాంప్లెక్స్, వర్క్‌షాపు, వేర్ హౌస్, కాన్ఫరెన్స్‌హాలు, ఆడియో వీడియో సెంటర్, విశ్రాంతి భవనం, వే బ్రిడ్జి, సెక్యూరిటీ భవనం, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్, ఎక్విప్‌మెంట్ అండ్ ఫర్నిచర్ ఫర్ టెస్టింగ్ అండ్ ట్రైనింగ్ సెంటర్, సిల్క్ ఈటీపి, కాటన్ ఈటీపీ తదితరాలను ఏర్పాటు చేస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో ఎర్రయ్య

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

చీరాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : బాలికలు అన్నిరంగాల్లో రాణించి ఉన్నతంగా ఎదగాలని జిల్లా డీఐఈవో ఎర్రయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 23వ వార్షికోత్సవం వేడుకలు ప్రిన్సిపాల్ స్నేహలత ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో 2024-25 కళాశాల ప్రగతిని కొనియాడారు. విద్యా హక్కులు. మనుగడ తదితర అంశాలను వివరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మురళి, ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ బాలికలు ధైర్యంతో మెలగాలన్నారు. సమస్యలు ఉన్నప్పుడు తెలివితో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బత్తుల బ్రహ్మారెడ్డి, రాఘవరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీ న్యాయాధికారి రామకృష్ణపై ఫిర్యాదు



సీఐ సుబ్బరాజుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

అద్దంకి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని ఒక ఇంటర్వ్యూలో అసభ్యపదజాలంతో మాట్లాడిన విశ్రాంత న్యాయాధికారి రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని సీఐ సుబ్బరాజుకు గురువారం అద్దంకి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నేతలు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మందా ఆమోసు, పూనూరి నరేంద్ర సీఐ సుబ్బరాజుకు ఫిర్యాదు చేశారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

మేదరమెట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పర్యవేక్షణ కొరకు దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మేదరమెట్ల ఎస్‌ఐ షేక్ మహమ్మద్ రఫీ తెలిపారు. గురువారం మేదరమెట్లలో సెంటర్‌లో బిగిస్తున్న సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు.



మేదరమెట్లలో సీసీ కెమెరాల ఏర్పాటుపై మాట్లాడుతున్న ఎస్‌ఐ మహమ్మద్ రఫీ, సింథైట్ ప్రతినిధులు

ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మొత్తం 40 సీసీ కెమెరాలను బిగిస్తున్నామన్నారు. అద్దంకి రూరల్ కూడలి (ఫైలాన్ సెంటర్), రావినూతల రోడ్డు, గుంటూరు రోడ్డు, గ్రామంలోని ప్రధాన కూడలీలలో సీసీ కెమెరాలను బిగిస్తున్నాట్లు తెలిపారు. సింథైట్ కంపెనీ సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో సింథైట్ ప్రతినిధులు అబ్దుల్ సాలామ్, జయరామన్, పోలీస్ బృంది పాల్గొన్నారు.

చీరాల రైల్వే స్టేషన్‌కు సొబగులు

- సుమారు రూ.17కోట్ల నిధులతో స్టేషన్‌లో ఆధునికీకరణ
- ఏడాదిగా జరుగుతున్న పనులు
- త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికుల విజ్ఞప్తి

చీరాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భారతీయ రైల్వే మౌలిక వసతుల కల్పనతో భారీ పరివర్తన దిశతో పురోగమిస్తుంది. ఈక్రమంలోనే చీరాల రైల్వే స్టేషన్‌కు మహర్దశ రానుంది. సుమారు రూ17కోట్ల అమృత్ భారత్ సర్కార్ స్కీం ద్వారా చీరాల స్టేషన్లఓ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. రెండు ఎక్స్‌లేటర్ సుమారు 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, మూడు షెడ్లు, పెయిడ్ విశ్రాంతి గదులు, మరుగు దొడ్లు, పార్క్, ఫ్లోరింగ్ వంటి పనులు సుమారు ఏడాదిగా సాగుతున్నాయి. ఇప్పుడు జరుగుతున్న ఆధునికీకరణతో రైల్వేకు చీరాల నుంచి మరింత ఆదాయంతో పాటు మెరుగైన సేవలు అందుతాయని అధికారులు, ప్రజలు భావిస్తున్నారు. అయితే నిర్మాణాలు ఇప్పటికే సంవత్సర కాలం నుంచి జరుగుతున్నాయి. మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. గురువారం స్థానిక అభివృద్ధి కమిటి ప్రతినిధులు పనులను పర్యవేక్షించారు. ఈక్రమంలో ప్రస్తుతం స్టేషన్‌లో ఫ్లోర్ అస్తవ్యస్తంగా ఉంది. నిత్యం దుమ్ముధూళితో ఉంటోంది. ఈక్రమంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు వేగంగా పూర్తి చే యాలని కోరుకుంటున్నారు.


స్టేషన్‌లో జరుగుతున్న ఎక్స్‌లేటర్ నిర్మాణం


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు


చీరాల రైల్వే స్టేషన్

అభివృద్ధి పనులతో అందరికీ సౌకర్యాలు



గత ఏడాది కాలంగా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరో ఏడాది జరిగే అవకాశం ఉంది. ఆధునీకరణతో స్టేషన్ సుందరంగా ఉంటుంది. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు ఉంటాయి.

- భరణి, అభివృద్ధి కమిటీ సభ్యులు

పనులు వేగంగా పూర్తి చేస్తాం



స్టేషన్‌లో పనులు జరుగుతుండగా కొంత అసౌకర్యం జరుగుతున్నది వాస్తవమే. అయితే ఆధునీకరణ వలన ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి. ప్ర భుత్వానికి ఆదాయం ఉంటుంది. ప్రజలకు సేవలు అందుతాయి.

- నల్లగొర్ల సింగయ్య, స్టేషన్ సూపరింటెండెంట్



పౌరహక్కుల దినోత్సవ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ శివశ్రీను

ప్రతి వ్యక్తికీ సమాన పౌరహక్కులు

పంగులూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మనుషులంతా ఒకటేనని, భారత రాజ్యాంగం ప్రతి వ్యక్తికీ పౌరహక్కులను సమానంగా కల్పించిందని డిప్యూటీ తహసీల్దార్ శివశ్రీను అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో గురువారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శివశ్రీను మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో నెలకొన్న అంతరాలు తొలగిపోతాయన్నారు. విద్య ప్రాధాన్యతను గుర్తించి బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించి చదువులు కొనసాగించాలని కోరారు. అంటరానితనం నేరమనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని హాస్టల్ వార్డెన్ వీరాస్వామి అన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు చింపారావు, గ్రేస్‌పావని, మహిళా పోలీస్ గద్దె అరుణ, ఏఎన్ఎం ఎస్తేర్‌రాణి, కార్యాలయ సిబ్బంది పీటర్, శరత్, లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

వయోజనులకు అక్షరజ్ఞానం అందించాలి

పంగులూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో నిరక్షరాస్యులైన ప్రతివ్యక్తినీ సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు మహిళా వలంటీర్లు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంఈవో వీరాంజనేయులు కోరారు. పంగులూరు వెలుగు కార్యాలయంలో గురువారం ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చేపట్టాల్సిన అక్షరాస్యత అంశాలపై మహిళా వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వయోజన విద్య సూపర్ వైజర్ జ్యోతి, వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్, సీసీలు ఎస్‌హెచ్ గ్రూప్ వలంటీర్లు పాల్గొన్నారు.

సదరమ్ సర్టిఫికెట్ అందించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు, బాధిత మహిళ

చీరాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అర్హురాలైన మహిళకు సదరమ్ సర్టిఫికెట్‌ను ఇవ్వాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను కోరారు. పట్టణానికి చెందిన కుంచాల కృష్ణవేణి పుట్టుకతోనే ఓ కంటిని కోల్పోయారు. ఈక్రమంలో దాదాపుగా 10ఏళ్లుగా పెన్షన్ అందుకుంటుంది. అయితే ఇటీవల సదరమ్ వెరిఫికేషన్‌లో భాగంగా చీరాల ఏరియా హాస్పిటల్ వైద్యులు ఆమెకు ధ్రువపత్రాన్ని ఆటంకం వ్యక్తం చేశారు. దీంతో జరిగిన ఘటనపై చిన్నపాటి వివాదం నెలకొంది. దీంతో టీడీపీ నాయకులు పట్టణంలో ఆందోళన చేశారు. అలాగే అర్హురాలికి సర్టిఫికెట్ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైన్ షాపుల చోరీ కేసులో పోలీసులకు కీలక సమాచారం

అద్దంకి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపులలో చోరీలకు పాల్పడిన కేసులకు సంబంధించి పోలీసులకు కీలక సమాచారం లభించినట్లు సమాచారం. సోమవారం అర్ధరాత్రిదాటిన తరువాత అద్దంకి మండలం శాంతినగర్ వద్ద మారుతీ వైన్స్, బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు వద్ద అంకమ్మతల్లి వైన్స్ షాప్‌ల్లో చోరీలు జరిగాయి. పెద్ద మొత్తంలో కాస్ట్లీ మద్యం చోరీకి గురైంది. వి.కొప్పెరపాడు వద్ద వాచ్‌మన్‌ను బెదిరించి చోరీకి పాల్పడ్డాడు. కారులో వచ్చిన 8 మంది చోరీకి పాల్పడినట్లు వాచ్‌మన్ సమాచారం ఇవ్వడంతో ఆ కోణంలో అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో వినుకొండ ప్రాంతానికి చెందిన వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు కీలక సమాచారం రావడంతో ఆ కోణంలో విచారిస్తున్నారు. చోరీకి పాల్పడ్డ మద్యాన్ని కూడా గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. పోలీసులు వెంటనే స్పందించడంతో కీలక సమాచారం లభించినట్లు తెలుస్తుంది. దీంతో దొంగలించబడ్డ మద్యం లో కొంత భాగం దొంగలు తాగినప్పటికీ అత్యధిక శాతం రికవరీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.


శాంతినగర్ వద్ద చోరీ జరిగిన మారుతీ వైన్ షాపు వద్ద విచారిస్తున్న సీఐ సుబ్బరాజు (ఫైల్)

గాంధీజీకి ఘన నివాళి

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మహనీయుల ఆశయ సాధనకు పాటుపడాలని పలువురు టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు గురువారం వేటపాలెం మండలం పంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దోగుపర్తి బాలకృష్ణ, పల్లప్రోలు శ్రీనివాసరావు, నాగు ఆవుల అశోక్ పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : సత్యం, అసింస గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరయ్య, షేక్ మహమ్మద్ రఫీ, శ్రీనివాసరవు, దివాకర్‌దత్తు, దేవపాలన, చంద్రమౌళి, గురు శేఖర్, అంజాద్ బాషా, మలాది శ్రీనివాసరావు, ఆంజనేయులు, శ్రీలక్ష్మిశి వకుమారి, ఉమ అన్నపూర్ణ పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని చెన్నుపల్లి గ్రామ సచివాలయంలో జాతిపిత మహాత్మా గాంధీకి ఉద్యోగులు నివాళులర్పించారు. గాంధీజీ వర్ధం తి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ వజ్రయ్య పాల్గొన్నారు.

పర్చూరు : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహానికి తహసీల్దార్ బ్రహ్మయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, వీర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మామిడిపాక హరిప్రసాద్, నారాయణ, అజ య్, సిద్ధయ్య, బుజ్జి, పే ర్ని హరి, కొత్తూరు శ్రీను పాల్గొన్నారు.

చినగంజాం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని గాంధీ విగ్రహానికి టీడీపీ బా పట్ల పార్లమెంట్ వాణి జ్య విభాగ ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ వనితా సభ్యులు, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ వనితా మండల అధ్యక్షుడు వేదాల కృష్ణకుమారి, కార్యదర్శి మోటుమర్రి శేషకుమారి, కోశాధికారి అమరా నాగలక్ష్మీ, కేబినెట్ కోశాధికారి పొట్టి శైలజ, ఫాస్ట్ అధ్యక్షుడు కోటా సుచిత్ర, సభ్యులు సులోచన, మీనా, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, శ్రీనివాస దీక్షితులు, గంటా అంకమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, టీడీపీ నాయకులు టీ.జయరావు, భయ్యా సతీష్‌కుమార్, ఘంటా నరసింహారావు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ, వాసవీ వనితా సభ్యులు


వేటపాలెంలో గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్నటీడీపీ కూటమి నాయకులు


గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న పర్చూరు తహసీల్దార్ బ్రహ్మయ్య

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చినగంజాం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కారంచేడు ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల వారు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో చిన్నారులు, పెద్దవాళ్లకు కంటి పరీక్షలు ఉచితంగా చేస్తారని, అర్హులైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేస్తారని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

7లోపు దరఖాస్తు చేసుకోండి

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలో చంద్రన్న స్వయం ఉపాధి పథకంలో రుణ సౌకర్యాన్ని పొందేందుకు లబ్ధిదారులు ఈ నెల 7వతేదీలోపు వారి గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మీనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలో బీసీలకు రూ.31లక్షలతో 16 యూనిట్లు, ఈబీసీలకు రూ.14లక్షలతో 8 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు.



కేజీబీవీలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

విద్యార్థులకు అందుతున్న వసతులపై తనిఖీలు

బల్లికురవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న వసతులపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వచ్చిన ప్రత్యేక టీంలు గత మూడు రోజుల నుంచి తనిఖీలు చేస్తున్నాయి. బల్లికురవ మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఉన్నతాధికారులు గుర్తించి అక్కడ విద్యార్థినులకు అందుతున్న వసతులు వారి ఇబ్బందులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆడిట్ టీంలను పంపించారు. గురువారం కేజీబీవీ విద్యాలయంలో తనిఖీల అనంతరం ఆడిట్ బృందం బాలికల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులు మీ పిల్లలకు ఎలా అందుతున్నాయన్న దానిపై అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో జిల్లా మెత్తం మీద 35 పాఠశాలలో ఈ తనిఖీలను చేస్తున్నట్లు టీం సభ్యులు తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

వేటపాలెం (చీరాలటౌన్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని 50 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళను రైలు ఢీకొంది. ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మేజర్ కాలువకు గండి

- గుర్తు తెలియని రైతుల నిర్వాకం
- గుంటుపల్లి మేజర్‌లో ఆయకట్టుకు అందని నీరు
- పూడ్పించిన డీసీ వైస్ చైర్మన్ పేరయ్య

బల్లికురవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచి కెనాల్ నుంచి చీలే గుంటుపల్లి మేజర్ కాలువకు గుంటుపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని రైతులు రాత్రి సమయంలో గండిని పెట్టి నీటిని దిగువ భూములకు రాకుండా చేశారు. దీంతో ఆయకట్టులో ఉన్న భూములకు చుక్క నీరు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన మెదలైంది. ఈ విషయం కొందరు రైతులు నీటి సంఘం డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్య దృష్టికి తీసుకు వచ్చారు. గురువారం డీసీ వైస్ చైర్మన్ ఎన్ఎస్పీ సిబ్బంది హుటాహుటీన గండి పెట్టిన ప్రాంతానికి తీసుకొచ్చి ఇసుక మూటలను తెప్పించి గండిని పూ డ్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్పీ సిబ్బంది రైతులతో మాట్లాడుతూ కాలువకు గండి ఎక్కడ పెడితే అక్కడ ఉన్న భూమికి చెందిన రైతులపై చర్యలు తప్పవన్నారు. గుంటుపల్లి మేజర్ కాలువ పరిధిలో ఆరు గ్రామాలకు సాగు నీరు చేరాల్సి ఉందన్నారు. రైతులు అందరూ సమన్వయంతో సాగు నీటిని పంటలకు వినియెగించుకోవాలన్నారు. గండిని పూడ్పించేందుకు వెంటనే స్పందించిన డీసీ వైస్ చైర్మన్ పేరయ్యను దిగువ భూములకు చెందిన రైతులు అభినందించారు.


గండిని పూడ్చిస్తున్న డీసీ వైస్ చైర్మన్ పేరయ్య, ఎన్ఎస్పీ సిబ్బంది


గుంటుపల్లి మేజర్ కాలువకు పెట్టిన గండి


ధ్వజస్తంబ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పర్చూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో నూతనంగా నిర్మించిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయం ప్రారంభ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంబాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. రుత్వికులు ప్రత్యేక పూజా కార్యక్రమాల నడుమ ధ్వజస్తంబాన్ని ఏర్పాటు చేశారు. నేడు శ్రీ మహాగణపతి, సుబ్రహ్మణ్య, ఆంజనేయ, అష్టలక్ష్మి దేవతా మూర్తి విగ్రహాల ప్రతిష్ఠకు సర్వం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీ, విజయానంద తీర్థస్వామి హాజరవుతున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు

బల్లికురవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సత్వరమే అందేలా అధికారులు పనిచేయాలని ప్రత్యేకాధికారి శ్రీనివాసులు కోరారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలంలో సచివాలయ ఉద్యోగులు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రానున్న వేసవిలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుండే అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చేతి పంపులను మర్మతులు చేయించి, స్టోరేజీ చెరువులకు నీటిని నింపాలన్నారు. అలానే అంటు వ్యాధులు రాకుండా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. చెత్త సంపద కేంద్రాలను వినియెగంలోకి తీసుకు రావాలన్నారు. అలానే ప్రభుత్వం పెట్టిన ప్రత్యేక యాప్‌లో ప్రజల వివరాలను నమోదు చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె. కుసుమకుమారి, ఈవోపీఆర్డీ సుమతి, అర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ గిరినాయక్ పాల్గొన్నారు.

సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సంఘటితంగా పోరాడితేనే దివ్యాంగుల సమస్యలు పరిష్కారమవుతాయని పలువురు ఎల్ఐసీ మేనేజర్ రమేష్‌బాబు అన్నారు. గురువారం ఎల్ఐసీ కార్యాలయంలో రాష్ట్ర దివ్యాంగుల ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అలాగే ఇటీవల స్థానికంగా పనిచేస్తున్న భూపతి నాగేశ్వరరావు రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జాయింట్ సెక్రటరీ రామిరెడ్డి, బ్రాంచ్ సెక్రటరీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సారా తయారీ స్థావరంపై దాడులు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

వేటపాలెం (చీరాలటౌన్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని అక్కాయిపాలెం సమీపంలోని జాతీయ రహదారి వద్ద చీరాల ఎక్సైజ్ శాఖ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా నాటుసారా తయారీ స్థావరాన్ని గుర్తించి 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ నాగేశ్వరరావు తెలిపారు. దాడుల్లో ఎస్సై శ్రీహరి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు వెళ్లాలి

బల్లికురవ జూనియర్ కళాశాల వార్షికోత్సవ సభలో ఎస్ఐ

బల్లికురవ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్ట లక్ష్యంతో కష్టపడి చదివి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఎస్ఐ జీవీ చౌదరి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 24వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా జరిగిన సభకు ప్రిన్సిపాల్ కె.సుధాకర్ అధ్యక్షత వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇంటర్ విద్య అంటే విద్యార్థుల భవిష్యత్‌కు పునాది అని ప్రతిఒక్కరూ గుర్తెరిగి చక్కగా చదుకోవాలన్నారు. చదువు ఉంటేనే కుటుంబాలు ఆనందంగా ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం విద్యా ర్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. నూరుశాతం ఫలితాలు సాధించేలా తాము శాయ శక్తులా విద్యార్థులను తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలువురు విద్యార్థులు హాస్య నాటికలతో ఆనందపరిచారు.సభలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, కె.హనుమంతురావు, కేబీ వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగరాజ, హరిహరన్‌రెడ్డి పాల్గొన్నారు.



కళాశాల వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఎస్ఐ జీవీ చౌదరి